Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం


Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 309 పేజీలు 8 వెల : 5 శుక్రవారం 08 మే 2026




# సంపద సృష్టితోనే అభివృద్ధి సాధ్యం





**అభివృద్ధి లేకుంటే సంక్షేమం లేదు**

**రిఫార్మ్, ఇన్నోవేషన్, డెలివరీ చాలా ముఖ్యం**

**వారసత్వంగా రూ.9,74,000 కోట్లు అప్పు**

**రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నాం**

**కలెక్టర్ల సమిష్టి కృషితోనే సమస్యలకు పరిష్కారం**

**కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు**

అమరావతి,:అభివృద్ధి లేకుంటే సంపద లేదని.. సంపద లేకుంటే సంక్షేమం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. మనం అందించే సేవలపై ప్రజలు సంతృప్తి చెందాలని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ గురువారం సచివాలయంలో జరుగుతోంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. అధికారులు సమష్టిగా పనిచేసి.. ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. ప్రజాసమస్యలను వందశాతం పరిష్కరించాలని మార్గనిర్దేశర చేశారు. వారసత్వంగా రూ.9,74,000 కోట్లు అప్పుగా వచ్చాయని సీఎం చంద్రబాబు తెలిపారు. జగన్ హయాంలో కేంద్రప్రభుత్వం నుంచి రావాల్సిన స్కీముల నుంచి రూ. 10వేల కోట్లు డైవర్ట్ చేశారని ధ్వజమెత్తారు. దీంతో వారు డబ్బులు ఇవ్వలేదని చెప్పారు. రూ. 1,30000 వేల కోట్లు అప్పులు చెల్లించకుండా ఉంచేశారని మండిపడ్డారు. ఏపీని పునఃనిర్మిస్తామని తాను, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చామని ప్రస్తావించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. రిఫార్మ్, ఇన్నోవేషన్, డెలివరీ అనేది చాలా ముఖ్యమని చెప్పుకొచ్చారు. అందరి సహకారంతో రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వచ్చిందని.. ఇది సమష్టి విజయమని ఉద్ఘాటించారు. ఈ అవార్డు తనకు బాధ్యతతో కూడినది అని.. నిజానికి ఇలాంటి అవార్డులు పాజిటివ్ మూడ్ క్రియేట్ చేస్తాయని వ్యాఖ్యానించారు. మీ అందరి సహకారంతోనే తనకు ఈ అవార్డు వచ్చిందని అన్నారు. రెండేళ్ల క్రితం రాష్ట్రం గురించి ఏం మాట్లాడారని? ఇప్పుడు ఏం మాట్లాడుకుంటున్నారనే దానికి ఈ అవార్డు ఉదాహరణ అని చెప్పుకొచ్చారు. మంత్రులు, సీఎస్ మొదలుకుని... గ్రామస్థాయి అధికారి వరకు పనిచేయడం వల్లే ఈ అవార్డు దక్కిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ పెట్టుబడులను ఏపీకి తీసుకురాగలిగామని సీఎం చంద్రబాబు తెలిపారు. పెట్టుబడుల కోసం 28 ఉత్తమ విధానాలు తీసుకువచ్చామని చెప్పుకొచ్చారు. గ్రీన్‌ఎనర్జీ, డేటా సెంటర్ పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీ ఉందని వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు రూ.23లక్షల కోట్ల ఎంవోయూలు పూర్తి చేశామని తెలిపారు. ఇప్పటికే జరిగిన ఎంవోయూల ద్వారా 24లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని వివరించారు. దేశంలోని అతిపెద్ద కంపెనీలన్నీ ఏపీలో ఏర్పాటు కాబోతున్నాయని వెల్లడించారు. వారానికో కంపెనీ తీసుకొస్తున్నామని.. రోజుకో శంకుస్థాపన చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఈ కాన్ఫురెన్స్‌కు రెండు జిల్లాల నుంచి కొత్తగా కలెక్టర్‌లు వచ్చారని తెలిపారు. ఎన్నికల్లో ప్రజల మ్యాండేట్ నిన్న కూడా చూశామని... సరిగా పనిచేయకపోతే ప్రజలు ఆదరించరని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనారోగ్యం కారణంగా ఈ సమావేశానికి రాలేకపోయారని... తాము ఇద్దరం కలిసి ఇచ్చిన హామీలు నేరవేర్చాల్సి ఉంటుందని చెప్పారు.

## గంగుల కార్యాలయం, కౌశిక్ రెడ్డి కారుపై దాడి

**బిజెపి కార్యకర్తుల గుండాల్లో దాడులు చేయడమేంటి**

**మండిపడ్డ కెటిఆర్ ,హరీష్ రావులు**



హైదరాబాద్: కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారుపై బీజేపీ శ్రేణులు దాడి చేయడంపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. దాడులను తీవ్రంగా ఖండించారు. పట్టపగలు గూండాల్లా వచ్చి వాహనాలు, ఆఫీసుపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొల్పుతున్నారంటూ బండి సంజయ్‌పై మాజీ మంత్రి ఫైర్ అయ్యారు. 'ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో పాటు కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ అనుచరుల హేయమైన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. దాడి జరిగిన వెంటనే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డితో మాట్లాడాం. పట్టపగలు గుండాల మాదిరిగా క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించి వాహనాలను, ఆఫీసును ధ్వంసం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య. కళ్లముందే ఇంత అరాచకం సృష్టిస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటు. సీఎం రేవంత్‌కు బీ-టీంగా మారిన బండి సంజయ్.. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఈ పిరికిపంద చర్యలకు ఉసిగొలుపుతున్నారు. ప్రతిసారి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు కుప్పిగంతులు వేయడం తప్ప కరీంనగర్ ప్రజలకు బండి సంజయ్ చేసిందేమీ లేదు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉండి తన అనుచరులతోనే శాంతి భద్రతలను దెబ్బతీసేలా వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. జై తెలంగాణ' అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బండి సంజయ్ అనుచరుల దాడిని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. కరీంనగర్ పట్టణంలో బీజేపీ గుండాలు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్‌పై కర్రలు, రాడ్లతో దాడి చేసి కిటికీల అద్దాలు పగులగొట్టారని తెలిసిందే. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ ముగిసిన 10 నిమిషాలకే బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడి కౌశిక్ రెడ్డి వాహనం ధ్వంసం చేశారు. కౌశిక్ రెడ్డిపై సైతం దాడికి యత్నించారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ ఎమ్మెల్యే పార్టీ కౌశిక్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి నాయకులు, కార్యకర్తల యోగక్షేమాల అడిగి తెలుసుకున్నారు. ఏకంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే, ఆయన అనుచరులు దాడి చేయడం అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ అన్నారు.




## పదేళ్లలో గ్లోబల్ సిటీగా హైదరాబాద్

**భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు**

**అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేలా అభివృద్ధి**

'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో మంత్రి శ్రీధర్ బాబు




## ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు

- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం
- గృహ విప్లవం, రెవెన్యూ సంస్కరణలతో నవశకానికి శ్రీకారం
- అదనపు ఎమ్మార్వోల నియామకం
- ఏ చిన్న పొరపాటు జరిగిన ఉపేక్షించేది లేదు
- ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల సమీక్ష




## రాజ్యాంగేతర శక్తిగా తమిళ గవర్నర్ వ్యవహారం

**ప్రజాతీర్పును గౌరవించకపోవడం అవమానం**

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపాటు

## ఒకే ప్లాట్ ఫాంపైకిరెవెన్యూ, రిజిస్ట్రేషన్ సర్వీసులు




అమరావతి, రిజిస్ట్రేషన్ శాఖను సిటిజెన్ ఫ్రెండ్లీగా తయారు చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సర్వీసులు ఒకటే ప్లాట్ ఫాంపైకి తీసుకురావాలని నిర్ణయించామన్నారు. డిజిటలైజేషన్ పక్రియను వేగంగా చేపడుతున్నామని చెప్పారు.
బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి అభినందనలు తెలియజేశారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరుగుతున్న 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మంత్రి ప్రసంగిస్తూ.. రాష్ట్రాన్ని గత పాలకులు విధ్వంసం చేసినా.. పునర్నిర్మించుకుంటున్నామని తెలిపారు. భూ సంబంధిత అంశాల్లో సంస్కరణలు తీసుకువచ్చామని.. అడంగళ్లు, పాస్ పుస్తకాలు వేగంగా అందిస్తున్నామని చెప్పారు. 1.37 లక్షల ఎకరాలు 22ఏ నుంచి తొలగించామని మంత్రి వివరించారు.

రీసర్వే పక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి భూ వివాదాల్లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తామని వెల్లడించారు. రాష్ట్రం నుంచి సింగపూర్ దేశానికి అధ్యయనం కోసం వెళ్లామని.. పాలనాపరమైన అంశాలను చాలా నేర్చుకున్నామని అన్నారు. సింగపూర్ దేశంలో ప్రెసిషన్, ఇంటిగ్రేషన్, సైన్స్‌ను పాలనలో ఇంటిగ్రేట్ చేశారన్నారు. గవర్నెన్సు అంటే టీమ్ వర్క్‌గా పని చేస్తున్న విధానం సింగపూర్‌లో ఉందని...

ఏపీలోనూ ఇదే అంశాన్ని సీఎం పదేపదే చెబుతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను రీ-ఫోకస్ చేసేందుకు కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఉపకరిస్తోందని సీఎస్ సాయిప్రసాద్ అన్నారు.




## 2లక్షల రుణమాఫీ చూపించండి

**లేకుంటే రాజకీయ సన్యాసం తీసుకోండి**

పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్‌కు వేముల సవాల్

# తమిళనాట కొనసాగుతున్న ఉత్కంఠ

**గవర్నర్‌తో మరోమారు విజయ్ భేటీ**

**మెజార్టీకి అవసరమైన మద్దతు లేఖలు కోరిన గవర్నర్**

**టివికె పార్టీకి అధికారం దక్కడంపై తొలగని అనిశ్చితి**




మెజార్టీ కనిపించడం లేదని వివరించారు. మెజార్టీతోనే రావాలని గవర్నర్ సూచించారు అని లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. అయితే, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మరే ఇతర పార్టీని ఆహ్వానించబోమని విజయ్‌కు గవర్నర్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

# 2లక్షల రుణమాఫీ చూపించండి

హైదరాబాద్: రాహుల్ గాంధీ చెప్పినట్టు ప్రతి రైతుకు రూ. 2 లక్షల రుణమాఫీ జరిగి ఉంటే.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటా.. నువ్వు సిద్ధమా అంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సవాల్ విసిరారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సవాల్ విసిరారు. రూ.50వేల కోట్ల రుణమాఫీ చేస్తామని కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమే ఇప్పటివరకు మాఫీ చేశారని వెల్లడించారు. రుణమాఫీపై ఇచ్చిన హామీ గురించి, రేవంత్‌రెడ్డి రుణమాఫీ ఎందు చేయడం లేదని రాహుల్‌గాంధీని ప్రశ్నిస్తున్నామని అందులో తప్పేమిలేదని అన్నారు. కేసీఆర్, కేటీఆర్‌తోనే పదేళ్ల పాటు రైతన్నలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. 2009 నుంచి కేటీఆర్ అప్రతిహతంగా ఎమ్మెల్యేగా ఎన్నుకోబడుతున్నారని, పది సంవత్సరాలు ప్రపంచంలోనే అత్యుత్తమ మంత్రిగా పేరొందిన వ్యక్తని ప్రశంసించారు. జాతీయ మీడియా కూడా కేటీఆర్‌ను జాతీయ స్థాయి నాయకుడిగా గుర్తించిందని వివరించారు. కేటీఆర్ ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, ఒక్కసారైనా ఎమ్మెల్యేగా మహేష్‌కుమార్ గెలవలేదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి మెప్పుకోసం అడ్డగోలుగా, పీసీసీ స్థాయిని మరిచిపోయి , ధనం, అధికార అహంకారంతో మాట్లాడుతు న్నారని విమర్శించారు. నీచస్థాయి మాటలు మాట్లాడితే తాము కూడా మాట్లాడాల్సి వస్తుందని హెచ్చరించారు.ం

# రాజ్యాంగేతర శక్తిగా తమిళ గవర్నర్ వ్యవహారం

హైదరాబాద్: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకేను ప్రజలు గెలిపిస్తూ తీర్పు ఇచ్చారని.. దానిని ఆ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అగౌరవపరుస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్న తమిళనాడు గవర్నర్.. ప్రజా తీర్పును గౌరవించాలని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న తాజా పరిణామాలపై గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో టీ పీసీసీ చీఫ్ మాట్లాడారు. 108 స్థానాలు గెలిచి సింగిల్ లా÷-జ్గ÷స్ట్ పార్టీగా అవతరించిన టీవీకేను ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించకపోవడం దురదృష్టకరమని మహేశ్ కుమార్ గౌడ్ అభివర్ణించారు. గవర్నర్ తీరు రాజ్యాంగ స్ఫూర్తిని సమాధి చేసేదిగా ఉందన్నారు. గవర్నర్ తీసుకుంటున్న ఈ నిర్ణయాలు.. ఢిల్లీలో బీజేపీ హైకమాండ్ నుంచి వస్తున్నాయనే అనుమానం తనకు కలుగుతుందన్నారు. సింగిల్ లా÷-జ్గ÷స్ట్ పార్టీకి అవకాశమివ్వాలని సర్కారియా కమిషన్‌తోపాటు ఎస్ఆర్ బొమ్మై కేసులో సుప్రీంకోర్టు తీర్పులు స్పష్టంగా చెబుతున్నాయని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. గవర్నర్‌కు రాజ్యాంగం చదవడం తెలియదా? లేక రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రవర్తించాలనే ఉద్దేశపూర్వకంగా ఆయన ఇలా చేస్తున్నారా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. తమిళనాడులో గవర్నర్ ద్వారా పాలించాలని బీజేపీ చూస్తోందని టీపీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 59 సంవత్సరాల ద్రావిడ పార్టీల పాలనకు ప్రజలు చెక్ పెట్టిన.. దానిని అడ్డుకోవడానికి గవర్నర్‌ను ఆయుధంగా వాడుకుంటోందంటూ బీజేపీపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ మద్దతు ప్రకటించిన తర్వాత కూడా టీవీకే పార్టీకి అవకాశం ఇవ్వకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. కేరళ పర్యటన పేరుతో మరింత జాప్యం చేయడం యాదృచ్ఛికం కాదు.. కుట్ర రాజకీయాల్లో భాగమే అంటూ గవర్నర్ తీరును ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ ఎండగట్టారు. విజయ్ రెండుసార్లు రాజ్‌భవన్‌కు వెళ్ళినా వట్టి చేతులతో తిరిగి రావడం చూస్తే గవర్నర్.. రాజ్యాంగ పదవిలో ఉన్న బీజేపీ గేట్‌కీపర్ అని స్పష్టమవుతోందని వ్యంగ్యంగా అన్నారు.

రాజ్యాంగం ప్రకారం గవర్నర్ హోదా నామ మాత్రమే.. విచక్షణాధికారాన్ని బీజేపీ కోసం దుర్వినియోగం చేయడం రాజ్యాంగ ద్రోహం చేయడమేనని ఈ సందర్భంగా గవర్నర్ తీరును ఆయన ఎండగట్టారు.

కోట్ల మంది ఓట్లు వేసి విజయ్ పార్టీని గెలిపిస్తే.. వారి కలలను గవర్నర్ రాజ్‌భవన్‌లో బంధించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని మహేశ్ కుమార్ గౌడ్ అభివర్ణించారు. గవర్నర్ పదవి రాజ్యాంగ పదవి.. దాన్ని బీజేపీ రాజకీయ పావుగా వాడుకుంటే దేశంలో ఫెడరల్ వ్యవస్థకే ప్రమాదమని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు.

## పదేళ్లలో గ్లోబల్ సిటీగా హైదరాబాద్

హైదరాబాద్: అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా ఆకర్షించేలా... పదేళ్లలో హైదరాబాద్ ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మహా నగరాల అభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా... భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తోందని వివరించారు. గురువారం ముంబైలో నిర్వహించిన 'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో 'బియాండ్ పాలసీ: డిజైన్డ్ టు విన్ ది గ్లోబల్ జీసీసీ రేస్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047'కు శ్రీకారం చుట్టామని వివరించారు. ప్రపంచంలోని అనేక నగరాలు అస్తవ్యస్త పట్టణీకరణ వల్ల 'అర్బన్ కొలాప్స్' కోరల్లో చిక్కుకున్నాయని, అలాంటి చారిత్రక తప్పిదాన్ని హైదరాబాద్ విషయంలో తాము చేయాలనుకోవడం లేదన్నారు. అందుకే... భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించే బాధ్యతను తీసుకున్నామన్నారు. ఆ దిశగానే భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, మెట్రో విస్తరణ, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, ఆర్ఆర్ఆర్, మూసీ ప్రక్షాళన, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఐకం ఇన్నోవేషన్ హబ్ తదితర కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామన్నారు. కేవలం టెక్ కంపెనీలే కాకుండా... బ్యాంకింగ్, లైఫ్ సైన్సెస్, సెమీ కండక్టర్లు, రక్షణ రంగం, ఎఫ్ఎంసీజీ, స్పేస్ టెక్, ఆతిథ్యం తదితర బహుళ రంగాలకు చెందిన దిగ్గజ సంస్థలు జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ ను తమ మొదటి ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయన్నారు. గతేడాది 70కి పైగా జీసీసీలు ప్రారంభమయ్యాయని, దేశంలో ఇదే అత్యధికమని వివరించారు. ఈ ఏడాది కొత్తగా 100 జీసీసీలను ప్రారంభించి... వాటిల్లో కొత్తగా లక్ష మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జీసీసీలను కేవలం బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్లకే పరిమితం చేయకుండా... వాటిని 'గ్లోబల్ వాల్యూ సెంటర్లు'గా మార్చేలా ప్రత్యేక 'కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్'ను సిద్ధం చేస్తున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధికి అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. హైదరాబాద్‌లో ఉన్న 'సిలికాన్ డెన్సిటీ (విభిన్న రంగాల నిపుణుల లభ్యత)'ని అందిపుచ్చుకుని 'మేడిన్ తెలంగాణ' బ్రాండ్ ను విశ్వవ్యాప్తం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో నాస్కాం ఛైర్మన్ శ్రీకాంత్, ప్రెసిడెంట్ రాజేష్ నంబియార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు

హైదరాబాద్: ప్రతి పేదవాడికి సొంత ఇల్లును సమకూర్చడం, భూ యాజమానులకు తమ భూమి పై స్పష్టమైన హక్కులను కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. ఇల్లు, భూమి ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీకని పేదవాడికి భద్రమైన భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ సంకల్పం అని మంత్రి పేర్కొన్నారు. పేదల జీవితాల్లో గౌరవప్రదమైన మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అనే మహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. పథకం కింద పేద కుటుంబాలకు వారి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. దాదాపు 4 లక్షల ఇళ్లను మంజూరు చేసి, రాష్ట్రవ్యాప్తంగా గృహ విప్లవానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో జరుపుతున్న సమీక్షలో భాగంగా గురువారం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారాలతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నల్గొండ ఇన్ ఛార్జి మంత్రి ఎస్సీ ,ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్, వాకాటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక బోర్డు వైస్ ఛైర్మన్ జి. చిన్నా రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జితేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో క్షేత్ర స్థాయిలోని పరిస్థితులపై స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంతో వ్యవహరించాలని, జిల్లా స్థాయిలో అధికారయంత్రాగమంతా సమన్వయంతో పనిచేస్తే అక్కడికక్కడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు




అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని ఆదేశించారు. ఒదిరమ్మ ఇండ్ల పథకం అమలులో అత్యధిక శాతం అధికారాలను కలెక్టర్లకే దఖలు పరిచామన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఒకసారి ప్రొసీడింగ్స్ ఇచ్చి, మొదటి బిల్లు వారి ఖాతాల్లో జమ అయిన లబ్ధిదారులందరికీ తదుపరి విడతల బిల్లులన్నిటిని సకాలంలోనే విడుదలయ్యేలా చూడాలని మంత్రిగారు కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా, పూర్తి పారదర్శకంగా జవాబుదారీ తనంతో పనిచేస్తూ అర్హులైన వారికే ఫలాలు దక్కేలా చూడాలని ఈ విషయంలో ఎక్కడ పొరపాటు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం సేకరించి పూర్తి స్థాయిలో వినియోగించకుండా మిగిలి ఉన్న భూముల్లో అర్హులైన వారికి ఇండ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు మంజురైనా వివిధ కారాణలతో నిర్మాణాలను పూర్తి చేయని వారికి కూడా వెసులుబాటు కల్పించే యోచనలో ఉన్నామని తెలిపారు. ముఖ్యంగా జిల్లాల్లో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరక్టర్లు పూర్తి బాధ్యతాయుతంగా విధులను నిర్వహించాలని, లబ్దిదారులు, ఉన్నతాధికారుల మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని , ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణపు పనులు ఏ స్థాయిలో ఉన్నా, ఈ నెల 20 వ తేదీలోగా లబ్దిదారుల ఎంపికను పూర్తి చేయాలని, ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపాలని మంత్రి పొంగులేటి సూచించారు. అర్హులైన పేదలనే లబ్దిదారులగా ఎంపిక చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ కార్యాలయాలన్నింటిని ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశాల్లో నెలకొల్పేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అలాగే లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో, అవసరానికి అనుగుణంగా, అదనంగా మరో తహశీల్దార్‌ను నియమించనున్నా మని మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన జిల్లా కలెక్టర్లు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, అటవీ తదితర శాఖల మధ్య ఉన్నభూ వివాదాల సమస్య కు శాశ్వత పరిష్కారం కోసం ఆయా విభాగాలు ఉమ్మడిగా సర్వే చేయడమే మార్గమన్నారు. ఈ దిశలో మరింత వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అటవీ, రెవెన్యూ అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా రెవెన్యూ విభాగంలో అనేక సంస్కరణలు తీసుకుని వచ్చి ఆర్డీవోలకు విస్తృతమైన అధికారాలు కల్పించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాకుండా, ఇతర ప్రయోజనాలకు వీటిని వినియోగిస్తే అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ పరిపాలనను బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్మెంట్స్ మరియు భూ రికార్డుల శాఖ ద్వారా సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. పేదలకు న్యాయం జరిగేలా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు.

# ప్రజా సమస్యలకు వందశాతం పరిష్కారం

**సమిష్టి పితో..ప్రజలకు జవాబుదారీతనం**

**పెట్టుబడుల కోసం 28 ఉత్తమ విధానాలు**

**సింగపూర్ పాలనా విధానంపై అధ్యయనం**

**మోడల్‌గా ఓ జిల్లాలో అమలు చేసి చూద్దాం**

**కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు దిశానిర్దేశం**



అమరావతి: ప్రజా సమస్యలను వంద శాతం పరిష్కరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రభుత్వ సేవలపై ప్రజలు సంతృప్తి చెందాలన్నారు. సచివాలయంలో ఏడో విడత కలెక్టర్ల సదస్సులో అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. అందరం సమష్టిగా పని చేయాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని చెప్పారు. సరిగా పరిపాలించకపోతే ప్రజలు ఆమోదించే అవకాశం లేదని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఇదే విషయం స్పష్టమైందన్నారు. 'ప్రజా సంతృప్తే నాకు కొలమానం. ప్రస్తుతం రూ.9.74 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయి. గత ప్రభుత్వం కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను దారి మళ్లించింది. దీంతో కేంద్రం నిధులు ఇవ్వడం ఆపేసింది. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ఆగిపోయింది. అభివృద్ధి లేకుంటే సంపద లేదు.. సంపద లేకుంటే సంక్షేమం లేదు. రాయల్ ఎన్‌ఫీల్డ్ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురాగలిగాం. పెట్టుబడుల కోసం 28 ఉత్తమ విధానాలు తీసుకొచ్చాం. గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్ పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానంగా మారింది. దేశంలో ఉన్న అతిపెద్ద కంపెనీలన్నీ ఏపీలో ఏర్పాటు కాబోతున్నాయి. వారానికో కంపెనీ తీసుకొస్తున్నాం. రోజుకో శంకుస్థాపన చేస్తున్నాం. ప్రజల కోసం పనిచేసే వ్యక్తులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని చంద్రబాబు అన్నారు.మంత్రుల సింగపూర్ పర్యటనపై జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఇచ్చిన ప్రజెంటేషన్ తదితర అంశాలపై సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. నేర్చుకోవటం అనేది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. అత్యుత్తమ విధానాలు ఎక్కడున్నా అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. సింగపూర్‌లో అనుసరిస్తున్న పాలనా విధానాలు అక్కడి ప్రజల విశ్వాసాన్ని దక్కించుకున్నాయని చెప్పారు. సింగపూర్‌లోని అత్యుత్తమ విధానాలను తీసుకుని ఓ జిల్లాను మోడల్‌గా అభివృద్ధి చేద్దామని అన్నారు. సింగపూర్ విధానాల అమలుకు 90 రోజుల యాక్షన్ ఎ÷-లాన్ తయారు చేసి పర్యవేక్షణ చేయాలని సూచించారు. 'నేను కాదు మనం అనే విధానంలో ముందుకు వెళ్తాం.. ఈ విధానం నేటి నుంచి నాతో మొదలవుతుంది' అని సీఎం పేర్కొన్నారు. బెంచ్ మార్క్ సెట్ చేసేలా ఏపీ అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో రోజుకో ఎంఓయూ.. వారానికో శంకుస్థాపన జరుగుతోందన్నారు. వేగంగా పనిచేయాలని.. అంతే వేగంగా అభివృద్ధి చూపించాలని సూచించారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ స్లోగన్‌కే పరిమితం కాకూడదన్నారు. పబ్లిక్ రిలేషన్స్ ఎంత ముఖ్యమో... పబ్లిక్ డెలివరీ అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. వినూత్నంగా ఆలోచిస్తే నిధుల కొరతను అధిగమించవచ్చన్నారు. జిల్లా కలెక్టర్ల మధ్య అభివృద్ధిలో పోటీ ఉండాలని తెలిపారు.

# తమిళనాట కొనసాగుతున్న ఉత్కంఠ



చెన్నై: తమిళనాడులో రాజకీయ పరిణామాలు క్షణక్షణానికి మారుతున్నాయి. టీవీకే చీఫ్ విజయ్ గురువారం మరోసారి లోక్‌భవన్‌కు వెళ్లి, గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిశారు. తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి, అసెంబ్లీలో మెజార్టీ నిరూపించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ భేటీపై లోక్‌భవన్ తాజాగా ప్రకటన విడుదల చేసింది. గవర్నర్ ఆర్లేకర్‌తో విజయ్ భేటీ అయ్యారు. మెజార్టీ కనిపించడం లేదని వివరించారు. మెజార్టీతోనే రావాలని గవర్నర్ సూచించారు అని లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. అయితే, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మరే ఇతర పార్టీని ఆహ్వానించబోమని విజయ్‌కు గవర్నర్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. గవర్నర్ ఆహ్వానం మేరకే విజయ్ ఆయన్ను కలిసినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రెండు రోజుల వ్యవధిలో రెండుసార్లు వీరి భేటీ జరిగింది. కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన నేపథ్యంలో బుధవారం గవర్నర్‌తో టీవీకే చీఫ్ భేటీ కాగా.. సంఖ్యాబలంపై గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేయలేదు. 118 మంది సభ్యులు సమకూరిన అనంతరం రావాలని సూచించినట్టు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం ఏర్పాటుచేయడానికి విజయ్‌కు అనుమతి ఇవ్వాలని వీసీకే గవర్నర్‌ను కోరింది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించే అవకాశంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఇద్దరేసి ఎమ్మెల్యేలున్న వీసీకే, సీపీఐ సానుకూలంగా స్పందించినా, ఇంకా అధికారికంగా చెప్పలేదు. టీవీకేకు తొలుత అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాన్ని డీఎంకే కూడా వ్యక్తం చేసింది. ప్రొటోకాల్ ప్రకారం తమిళనాడు ముఖ్యమంత్రికి అందించే పోలీసు కాన్వాయ్‌ను విజయ్ నిరాకరించారు. ప్రమాణస్వీకారానికి ముందే ఆ ఏర్పాటు తనకు వద్దని విజయ్ చెప్పినట్లు టీవీకే వెల్లడించింది. తమిళనాడులో టీవీకే నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధం నెలకొనడంతో ఆయన కాన్వాయ్‌ను వెనక్కి తీసుకున్నారంటూ వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. గురువారం పార్టీ నుంచి వచ్చిన స్పందనను పోలీసు అధికారులు కూడా ధ్రువీకరించారు. తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం ప్రొటోకాల్ ప్రకారం అందించిన సీఎం కాన్వాయ్ వాహనాలను విజయ్ తిరిగి ఇచ్చేశారని, తాము ఉపసంహరించుకోలేదని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. అలాగే ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. మే 4న ఫలితాల తర్వాత నాలుగు కాన్వాయ్ వాహనాలను పోలీసు శాఖ అందించింది. అలాగే ఆయన ఇంటి వద్ద కూడా భద్రతను పెంచింది. కాగా.. గవర్నర్ వద్దకు వెళ్లేటప్పుడు విజయ్ ప్రభుత్వ వాహనాన్ని వినియోగించలేదని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ం

# డ్రగ్స్ కట్టడి చేయడమే తొలి ప్రాధాన్యం

**రిపీటెడ్‌గా పట్టుబడితు పిడి యాక్ట్ పెట్టే ఆలోచన**

**ఈగల్ ఫోర్స్ ద్వారా మంచి ఫలితాలు**

**సమీక్షలో డిజిపి సివి ఆనంద్**

హైదరాబాద్:రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడి చేయడమే తమ తొలి ప్రాధాన్యమని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రిపీటెడ్‌గా డ్రగ్స్ కేసులో పట్టుబడితే పీడీ యాక్ట్ తరహా చట్టాన్ని ఉపయోగిస్తామన్నారు. రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గురువారం తొలిసారిగా ఈగల్ ఫోర్స్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలోని 35 విభాగాలపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. నార్కోటిక్స్‌పై అలర్ట్‌గా ఉన్నామని.. డ్రగ్స్ కట్టడి చేయడంలో మొదటి ప్రాధాన్యతతో ఉన్నామన్నారు. రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా జరిగిన ఆపరేషన్‌పై ఈ సమీక్షలో చర్చించామని వివరించారు. ఈగల్ ఫోర్స్ ద్వారా మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో ఆపరేషన్‌లు నిర్వహించడం ద్వారా నిందితులను అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. డ్రగ్స్ విషయంలో సరఫరాతోపాటు డిమాండ్.. ఈ రెండింటిపై దృష్టి సారించామని పేర్కొన్నారు. ఈగల్‌లో సిబ్బంది కొరత ఉందన్నారు. సివిల్ ఫోర్స్ అవసరం కూడా ఉందని చెప్పారు. డ్రగ్స్ సప్లయర్స్ ఆస్తులను సీజ్ చేయడం వంటి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటించారు. జిల్లాలో కమిషనర్లు, ఎస్పీలు కూడా డ్రగ్స్ కట్టడిలో కీలక పాత్ర పోషించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. జిల్లా స్థాయిలో నిఘా లోపించిందని ఈ సమీక్షా ద్వారా బహిర్గతమైందని చెప్పారు. నార్కోటిక్ ఐదు పోలీస్ స్టేషన్‌లు మంచిగా పని చేసి, ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక నుంచి యూనివర్సిటీలతోపాటు విద్యాసంస్థల్లో డ్రగ్స్ దొరికితే ఆ బాధ్యత యజమాన్యాలదేనని డీజీపీ సీవీ ఆనంద్ కుండబద్దలు కొట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో డీ అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాల్లో అధికారులు డ్రగ్స్ కేసుల దర్యాప్తు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమైందన్నారు.

# బెంగాల్ అసెంబ్లీ రద్దు

**గవర్నర్ ఆర్ఎన్ రవి ఉత్తర్వులు**

**రాజీనామాకు మమత ససేమిరా అనడంతో నిర్ణయం**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీని ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి గురువారం రద్దు చేశారు. ముఖ్యమంత్రి పదవికి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ రాజీనామా చేయకపోవడంతో.. గవర్నర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. బెంగాల్‌లో శనివారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. శుక్రవారం బీజేపీ శాసనసభాపక్షం సమావేశం కానుంది. ఈ సమావేశంలో శాసనసభాపక్ష నేతను ఎమ్మెల్యేలు ఎన్నుకోనున్నారు. అసెంబ్లీ రద్దుతో మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని గవర్నర్ రవి బర్తరఫ్ చేసినట్లు అయింది. రాజీనామా చేసేది లేదని ఇటీవల మమతా బెనర్జీ ప్రకటించారు. దీంతో ఈ చర్య అనివార్యమయ్యింది. లేకుంటే రాజ్యాంగ పరంగా చిక్కులు వచ్చేవి. 294 స్థానాలు ఉన్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి రెండు విడతలుగా ఎన్నికలు జరిగాయి. మే 4వ తేదీన ఈ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అధికారాన్ని బీజేపీకి కట్టబెట్టారు. దీంతో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్పష్టమైన మెజార్టీ ఇచ్చారు. దీంతో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీజేపీ అగ్రనేతలు ముహూర్తం ఖరారు చేశారు. మే 9వ తేదీ ఉదయం10 గంటలకు ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని పశ్చిమ బెంగాల్ బీజేపీ చీఫ్ సమీక్ భట్టాచార్య ప్రకటించారు. రోవైపు ముఖ్యమంత్రి అభ్యర్థిపై పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీపై ఘన విజయం సాధించిన సువేందు అధికారిని ముఖ్యమంత్రిగా నియమిస్తారనే ప్రచారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోంది. ఇంకోవైపు ఈ ఎన్నికల్లో ఓటమి పాలవడంతో ఎన్నికల సంఘంపై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. అసలు విలన్ ఈసీ అంటూ మండిపడ్డారు. ముఖ్యమంత్రి పదవికి తాను రాజీనామా చేసే ప్రసక్తే లేదంటూ ఆమె భీష్మించుకున్నారు. బెంగాల్ అసెంబ్లీ కాలపరిమితి గురువారంతో ముగిసింది.

## జలధారతో చెరువులకు నూతన జీవం

విజయవాడ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార?జలహారతి కార్యక్రమం కింద ఎన్‌టీఆర్ జిల్లాలో నీటి వనరుల అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా జి.కొండూరు మండలంలోని చెరువుమాధవరం గ్రామ పరిధిలో ఉన్న గ్రంథివాని చెరువుకు సంబంధించిన ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఫీడర్ ఛానల్ పునరుద్ధరణ పూర్తయితే వర్షాకాలంలో వచ్చే నీరు సక్రమంగా చెరువుకు చేరే అవకాశం కలుగుతుంది. దీంతో గ్రంథివాని చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, గ్రామంలోని వ్యవసాయ భూములకు సమృద్ధిగా సాగునీరు అందనుంది. చెరువు నిండుగా ఉండటం వల్ల భూగర్భ జలాల మట్టం పెరిగి బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుంది. అదేవిధంగా రైతులు వరి, మిర్చి, కూరగాయలు తదితర పంటలను సకాలంలో సాగు చేసుకునే అవకాశం పొందడంతో పాటు దిగుబడులు కూడా పెరిగే అవకాశముంది. అదేవిధంగా గ్రామ పరిసరాల్లో పచ్చదనం పెరగడం, పశువులకు తాగునీటి సౌకర్యం మెరుగుపడడం, నీటి కొరత సమస్య తగ్గడం వంటి అనేక ప్రయోజనాలు గ్రామ ప్రజలకు చేకూరనున్నాయి. ఈ పనులు పూర్తయిన తర్వాత చెరువుమాధవరం గ్రామం వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి ... మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

**వైసిపి నాయకులతో కలిసి నునుసురాళ్ల గ్రామంలో మామిడి తోటలు పరిశీలన.**

తుగ్గలి: ఉత్తేజిత న్యూస్:



మామిడి రైతుల ఆవేదనను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలియజేశారు. గురువారం రోజున తుగ్గలి మండల పరిధిలోని గల నునుసురాళ్ల గ్రామం నందు మండల వైసీపీ నాయకుల, గ్రామ రైతుల ఆధ్వర్యంలో మామిడి తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి తోట పైన ఆధారపడి జీవిస్తున్న రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె తెలియజేశారు. అకాల వర్షాలకు, గాలులకు చాలావరకు మామిడి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆమె తెలియజేశారు. మామిడి పంట సాగుకు ఎకరాకు ఒక లక్ష పెట్టుబడి వస్తుందని,మామిడి పంటకు సరైన ధర లేక మామిడి రైతులు అప్పుల పాలవుతున్నారని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం తక్షణమే మామిడి రైతులను ఆదుకొని,ఒక బాక్స్ 2000 రూపాయలు చొప్పున మద్దతు ధర ప్రకటించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు మామిడి పంటను ఎగుమతులు చేయడం ద్వారా మామిడి పంటకు మంచి ధర వస్తుందని ఆమె తెలియజేశారు. ఈ ప్రభుత్వాలు మామిడి పంట ఎగుమతులను పూర్తిగా నిలిపివేయడంతో మామిడి పంట ధర పూర్తిగా పతనమైందని ఆమె తెలియజేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రైతులకు ఏ పథకాలు సరిగ్గా అందడం లేదని ఆమె తెలియజేశారు.రైతులకు గిట్టుబాటు ధర,ఇన్సూరెన్స్ వంటివి రైతులకు అందరిని ద్రాక్షలాగా ఉన్నాయన్నారు. అదేవిధంగా మొక్కజొన్న రైతులకు కూడా సరైన మద్దతు ధర లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆమె తెలియజేశారు. కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి చాలా ఘోరంగా ఉందని ఆమె తెలియజేశారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మరియు వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రైతే రాజుగా వ్యవసాయానికి పెద్దపీట వేశారని ఆమె తెలియజేశారు.ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకొని గిట్టుబాటు ధర కల్పించాలని ఆమె తెలియజేశారు.లేనిపక్షంలో మామిడి రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్, మండల అధ్యక్షుడు గోపాల్ రెడ్డి,వైసిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి,గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రా రెడ్డి,మాజీ జడ్పిటిసి పగిడిరాయి జగన్నాథరెడ్డి, మేధావుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి రాతన మోహన్ రెడ్డి, నునుసురాళ్ల మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి,రంగారెడ్డి, శ్రీనివాసరెడ్డి,ప్రతాపరెడ్డి, రమణారెడ్డి,శభాష్ పురం రాఘవరెడ్డి,ముక్కెళ్ల లక్ష్మణస్వామి, నునుసురాళ్ల గ్రామ రైతులు,మామిడి రైతులు,వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గర్భిణీ స్త్రీలకు ఉచిత వైద్య శిబిరము

ఆత్మకూరు ఉత్తేజిత



ఆత్మకూరు సామాజిక వైద్య కేంద్రంలో గురువారము గిరిజన గర్భిణీ స్త్రీల ప్రత్యేక వైద్య శిబిరాన్ని డాక్టర్ రాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరానికి పరిసర గిరిజన గూడేముల నుంచి పలువురు గర్భిణీ స్త్రీలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు.
ఈ సందర్భంగా డాక్టర్ రాయుడు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు గర్భధారణ సమయంలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. తల్లి మరియు శిశువు ఆరోగ్యంగా ఉండేందుకు సమతుల్య ఆహారం తీసుకోవడం, ఐరన్ మరియు కాల్షియం మాత్రలను వైద్యుల సూచనల మేరకు వినియోగించడం అవసరమన్నారు.ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను గిరిజన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు.ఈ శిబిరంలో వైద్య సిబ్బంది గర్భిణీ స్త్రీలకు రక్తపోటు, హీమోగ్లోబిన్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమములో హెడ్ నర్స్ చెంచులక్ష్మి స్టాఫ్ నర్స్ గీత కుమారి ఎస్ ఎస్ కే మేనేజర్ ఇస్మాయిల్ జబివుల్ల ఆర్ డి టి స్వచ్ఛంద సేవ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఏర్పేడులో అభివృద్ధికి అడుగుజాడ..

**మర్రిమంద సి.సి. రోడ్డు పనులకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శంకుస్థాపన....**

**పాపానాయుడుపేట - మర్రిమంద బీసీ కాలనీ వరకు సి.సి. రోడ్డు...**




తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మర్రిమంద గ్రామపంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొని, పాపానాయుడుపేట నుండి మర్రిమంద బీసీ కాలనీ వరకు ఏడు మీటర్ల వెడల్పుతో నిర్మించనున్న సి.సి. రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు మండల అధ్యక్షుడు నాగరాజు నాయుడు పాల్గొన్నారు.
?ఈ పనులను చేపట్టిన క్లాస్ వన్ కాంట్రాక్టర్ దుద్దు రమణ మాట్లాడుతూ.. "సుధీర్ రెడ్డి , ఇక్కడ మీరు చేపడుతున్న సీసీ రోడ్ల అభివృద్ధి పనుల్లో నేను భాగస్వామిని కావడం నాకు ఎంతో ఆనందదాయకం. నిబంధనల ప్రకారం అత్యంత నాణ్యమైన రోడ్లను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాను" అని తెలిపారు.
?ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఇదే పాఠశాల ఆవరణలో లోకేష్‌పై దాడులు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. అరాచకాలకు వేదికైన చోటే నేడు అభివృద్ధి పనులకు పూనుకోవడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. "అభివృద్ధే మా కులగోత్రాలు.. చంద్రబాబు నాయుడే మా నాయకుడు" అని స్పష్టం చేస్తూ, రాబోయే రోజుల్లో డబుల్ రోడ్లు, ఇంటి పట్టాలు, స్వర్ణముఖి నది బ్రిడ్జి, ఎస్.ఎస్. కెనాల్ మరియు మల్లెమడుగు ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని హామీ ఇచ్చారు.
?ఈ కార్యక్రమంలో ఏర్పేడు మండల నాయకులు, సచివాలయ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మరియు పాపానాయుడుపేట, మర్రిమంద గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అభివృద్ధి పథంలో ఏర్పేడు మండలాన్ని అగ్రస్థానంలో నిలుపుతామని ఈ సందర్భంగా నేతలు పునరుద్ఘాటించారు

# 70 రోజులుగా పోరాటం చేస్తున్న స్విమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి.



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు స్విమ్స్ కార్మికుల వినతి.

తిరుపతి స్టాఫ్ రిపోర్టర్ ఉత్తేజిత మే 7.

తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులు గత 70 రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తున్న నేపథ్యంలో నేడు గురువారం ఉదయం న్యూక్లియర్ మెడిసిన్ విభాగంలో నూతన స్కానింగ్ మిషన్ ప్రారంభ కార్యక్రమానికి విచ్చేసిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాశ్ రెడ్డి, పనబాక లక్ష్మి, డాలర్ దివాకర్ రెడ్డి, స్విమ్స్ డైరెక్టర్ తదితర అధికారులకు స్విమ్స్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. వేణుగోపాల్, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం. మాధవ్, నగర అధ్యక్షురాలు పి. బుజ్జి, యూనియన్ కార్యదర్శి రవి, అధ్యక్షులు వి. సూరి, కోశాధికారి మారిముత్తు తదితరులు పాల్గొన్నారు.వినతిపత్రం అందజేసి మాట్లాడుతూ కార్మికులు గత 70 రోజులుగా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నప్పటికీ ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి సమస్యలు వివరించామని, కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని త్వరగా సమస్యలు పరిష్కరించాలని కోరారు. తక్కువ వేతనాలతో కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని, కార్మికుల సమస్యలపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సానుకూలంగా స్పందిస్తూ కొన్ని సాంకేతిక అంశాలు ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించి నాలుగు ఐదు రోజులలో సమస్యకు సానుకూల పరిష్కారం చూపించే దిశగా చర్యలు తీసుకుంటామని కార్మికులకు హామీ ఇచ్చారు. చైర్మన్ ఇచ్చిన హామీతో కార్మికులు సమస్య త్వరగా పరిష్కారం కావాలని ఆకాంక్షించారు.

# పోలి సచివాలయంలో ఆధార్ కేంద్రం గిరిజనులకు ప్రత్యేక ఏర్పాటు..

శ్రీకాళహస్తి ఉత్తేజిత మే 7.



శ్రీకాళహస్తి రూరల్ మండలం పోలి సచివాలయంలో గురువారం మండల అభివృద్ధి అధికారులు సచివాలయం సిబ్బంది ప్రగతి స్వచ్ఛంద సంస్థ గిరిజన సంక్షేమ శాఖ సంయుక్తంగా పోలి సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశారు ముఖ్యంగా విద్యార్థులు చిన్న పిల్లలు మహిళలు రైతులకు ఆధార్ కార్డులు కోసం ప్రభుత్వ పథకాలకు ఇబ్బందులు పడుతున్నారని తెలిసి అధికారులు ప్రత్యేకంగా వారి కొరకు ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి ఆధార్ నమోదు ఏర్పాటు చేయుటకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు ఎండ సైతం లెక్కచేయకుండా చిన్న పిల్లలు చంటి బిడ్డలతో సహా తల్లులు విద్యార్థులు మహిళలు వచ్చి సచివాలయంలో ఆధార్ కేంద్రం వద్ద ఆధార్ కార్డు నమోదు చేసుకున్నారు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రంలో చిరునామా మార్పులు కొత్తగా పెళ్లయిన వారికి ఆధార్ నమోదు కేంద్రాలు వద్ద తమ పేర్లు నమోదు చేసుకుని పేరు మార్పులు చేర్పులు చిరునామా మార్పులు ఇంటి పేర్లు నమోదు చేసుకునేటప్పుడు వారి వివరాలు అందించి ఆధార్ కార్డులు నమోదు చేసుకున్నారు పాఠశాలలో ప్రవేశం కొరకు ఇతర ప్రభుత్వ పథకాలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని గ్రామీణ ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది వెల్ఫేర్ అసిస్టెంట్ గిరిబాబు వీఆర్వో లోకేష్ పంచాయతీ కార్యదర్శి లీలా కుమార్ ప్రగతి స్వచ్ఛంద సంస్థ శ్రీకాళహస్తి మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్ గిరిజన సంక్షేమ శాఖ అధికారి బషీర్ సంతోష్ సచివాలయ సిబ్బంది
అనూష ధనుంజయలు రాజేశ్వరి పోలి పోలి గిరిజన కాలనీ ఈశ్వరయ్య గిరిజన కాలనీ వాంపల్లి గోవిందరావుపల్లి తదితర గ్రామాల నుండి చిన్న పిల్లలు మహిళలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని తమ పేర్లను ఆధార్ కేంద్రం వద్ద నమోదు చేసుకున్నారు

# ఇంటి స్థలాలు ఇచ్చే అంతవరకు పోరాటం ఆగదు

ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రాధాకృష్ణ .

రేణిగుంట ఉత్తేజిత మే 7.



రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 30 లో ఇంటి స్థలాలు ఇవ్వాలని రెండో రోజు కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగుతున్న దీక్షను ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ గారు మాట్లాడుతూ ప్రస్తుతమున్న ప్రభుత్వం పట్టణంలో పేదలకు అందరికీ రెండు సెంట్లు, గ్రామాల్లో ఉండే వారికి మూడు సెంట్లు స్థలం ఇస్తామని , చేసిన వాగ్దానం ఇంతవరకు అమలు కాలేదు అన్నారు. పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేటువంటి పనికి ప్రభుత్వం పూనుకోలేదని అన్నారు. ఈ సందర్భంగా సర్వే నెంబర్ 30లో ఉన్న ప్రభుత్వ భూమి తొమ్మిది ఎకరాలను కబ్జాదారుల ఆక్రమించుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు. దీనిని అడ్డుకుంటూ గత నాలుగు సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న తూకివాకం పంచాయతీ ప్రజలకు మద్దతుగా భారత కమ్యూనిస్టు పార్టీ, అదేవిధంగా ఏఐటియుసి నిలబడిందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా పేదలను ఆదరించి సర్వే నెంబర్ 30 లో ఉన్న భూమిని పేదల కేటాయించకపోతే, కబ్జాదారులు భూమిని ఆక్రమిస్తూ ఉంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటుందేమో గాని కమ్యూనిస్టు పార్టీ మాత్రం చూసుకుంటూ ఊరుకోదు, కచ్చితంగా కబ్జాదారులను ఎదుర్కొని భూమిని పేదలకు పంచి పెడతుందని తెలిపారు .ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాళ్ళు సుష్మాదేవి,సరిత,ధనమ్మ,ఉష,తదితరులు బాధ్యత వహించగా గ్రామస్తులు 40 మంది పాల్గొన్నారు. సిపిఐ రేణిగుంట మండల కార్యదర్శి వై ఎస్ మణి గారు భవిష్యత్తు పోరాట కార్యక్రమానికి సూచనలు ఇచ్చినారు.

# తిరుచానూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం..

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి...?

తిరుచానూరు ఉత్తేజిత మే 7.



తిరుచానూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రెడ్డివారి గురువారెడ్డి కోరారు. గురువారం ఆయన ఈ శిక్షణ తరగతులను సందర్శించి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యార్థుల మేధాశక్తిని పెంపొందించేందుకు ఈ శిబిరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.
?ప్రతిరోజూ ఉదయం 8 నుండి 11 గంటల వరకు ఉచితంగా నిర్వహించే ఈ శిబిరాల్లో యోగా, చిత్రలేఖనం, కంప్యూటర్ పరిజ్ఞానం, కథలు చెప్పడం మరియు జనరల్ నాలెడ్జ్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. 5 నుండి 10వ తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని వాడుకొని క్రమశిక్షణ కలిగిన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో తిరుచానూరు గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు, స్థానిక నాయకులు మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మున్సిపల్ కి వేలాలలో ఆదాయం రూ 4.73 లక్షల ఆదాయం

బేతంచెర్ల : ఉత్తేజిత ప్రతినిధి :



బేతంచెర్ల మునిసిపల్ కార్యాలయంలోకమిషనర్ హరిప్రసాద్,ఆధ్వర్యంలోఏడాది కాలానికి గురువారం సంత మార్కెట్,బండ్ల మెట్ట, కబేళాలకు బహిరంగా వేళలు నిర్వహించగా రూ. 4.73లక్షలు నగర పంచాయతీకి ఆదాయం వచ్చినట్లు తెలిపారు.సంత మార్కెట్ రామ సుబ్బారెడ్డి,రూ13.90 లక్షలు,బండ్ల మెట్ట పి.రామాంజనేయులు,రూ.19,09 లక్షలకు,కబేలా చంద్ర శేఖర్ రెడ్డి,రూ.1.80 లక్షలకు దక్కించుకున్నాట్లు తెలిపారు.

ఉత్తేజిత దినపత్రిక




# జగన్ అడ్డాలో పసుపు పండుగ

**కడప:** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు ఈసారి కడపలో జరగనుంది. మే 27 నుంచి మూడు రోజుల పాటు జగన్ అడ్డాలో పసుపు పండుగను నిర్వహించడానికి టీడీపీ సిద్ధమైంది. కడప సమీపంలోని సీకే దిన్నె మండలం చెర్లోపల్లి, పబ్బాపురం గ్రామాల పరిధిలో వేదిక ఏర్పాటుకు స్థలాలను ఎంపిక చేశారు. మహానాడులో నారా లోకేష్‌కు పార్టీలో మరింత కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. సాంప్రదాయ వంటకాలతో విందు భోజనాలు ఏర్పాటు చేయనున్నారు.

తెలుగుదేశం పార్టీ ప్రతీ ఏటా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడుపై దృష్టి సారించింది. నిన్నటి వరకు అమరావతి పునర్నిర్మాణ సభ పనులతో బిజీగా ఉన్న టీడీపీ నాయకత్వం అది విజయవంతంగా ముగియడంతో.. ఇప్పుడు పార్టీకి సంబంధించిన పెద్ద పండుగ మహానాడుపై దృష్టి సారించింది. ఈ క్రమంలో తాజాగా మహానాడు నిర్వహణకు ప్లేస్ ఫిక్స్ చేసింది. దీని ప్రకారం జగన్ అడ్డా కడపలో ఈ సారి పసుపు పండుగ జరగనుంది.

ఇక ఈనెల 27వ తేదీ నుంచి మూడు రోజులపాటు మహానాడును నిర్వహించనున్నారు. ఇప్పటికే సంబంధిత జిల్లా నేతలు మహానాడు ఏర్పాట్లు షురూ చేశారు. మూడు రోజుల పాటు జరిగే మహానాడు సభకు ఇరు రాష్ట్రాల నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. వారందరికి అన్నీ సౌకర్యాలు కల్పించేలా ఏర్పాట్లు చేసేందుకు టీడీపీ నేతలు రెడీ అవుతున్నారు. ఈ ఏడాది మహానాడును మే నెల 27 నుంచి మూడు రోజులపాటు.. కడప జిల్లా కేంద్రంలో నిర్వహించాలని తెలుగుదేశం అధిష్ఠానం నిర్ణయించింది. ఈ క్రమంలోపార్టీ ఎమ్మెల్సీలు బీద రవిచంద్రా, దామచర్ల సత్య, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణరాజు కడపకు వెళ్లి.. సభా వేదిక నిర్మాణం కోసం పలు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం కడప సమీపంలోని సీకే దిన్నె మండలం చెర్లోపల్లి, పబ్బాపురం గ్రామాల పరిధిలోని భూములను పార్టీ అధిష్ఠానం అనుమతితో.. మహానాడు కోసం ఎంపిక చేశారు.

అంతేకాక మహానాడు ప్రాంగణం, భోజన ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్‌కుకూడా స్థలాలను ఎంపిక చేశారు. ఈ స్థలం కడపను తిరుపతి, చిత్తూరు, అనంతపురం, హైదరాబాద్ మార్గాలతో కలిపేదిగా ఉందని నేతలు చెబుతున్నారు. స్థలాల ఎంపికకు సంబంధించి సభ తర్వాత కానీ.. ముందు కానీ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకునేలా.. భూముల యాజమానుల నుంచి నిరభ్యంతర పత్రాలు తీసుకున్నారు.

మహానాడు 2025 పనులకు సంబంధించి ఈ నెల 7న భూమిపూజ నిర్వహించి, శరవేగంగా పనులు పూర్తి చేయాలని నేతలు నిర్ణయించారు. అలానే మహానాడు కార్యక్రమం సందర్భంగా నారా లోకేష్‌కు పార్టీలో మరింత కీలకమైన బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది అంటున్నారు.

# శ్రీవారి ఆలయం ముందు మీకిది తగునా..

**తిరుమల:** శ్రీవారి దర్శనం కోసం కూడా గంటల తరబడి సమయం పడుతోంది. అయితే శ్రీవారి దర్శనం కోసం ఎన్నిగంటలు పట్టినా.. ఓపికగా ఉంటూ స్వామి వారిని దర్శించుకుని.. ఆ వేంకటేశ్వరుడి క్షణకాల దర్శనంతో ఆ బాధనంతా మర్చిపోతుంటారు భక్తులు. దర్శనం తర్వాత కొంతమంది కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటే.. మరికొంతమంది తిరుమల తిరుపతి దేవస్థానానికి విరాళాలు అందిస్తూ స్వామివారి కృపకు పాత్రులవుతూ ఉంటారు. కానీ శనివారం సాయంత్రం తిరుమల శ్రీవారి ఆలయం వద్ద ఊహించని ఘటన జరిగింది. శ్రీవారి ఆలయం ముందు.. క్యూలైన్‌లో ఉన్న భక్తుల మధ్య గొడవ చోటుచేసుకుంది. పరిస్థితి ఒకరిపై ఒకరు చేయి చేసుకునే వరకూ వెళ్లింది. అక్కడే ఉన్న టీటీడీ విజిలెన్స్, పోలీస్ సిబ్బంది వారిని వారించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ గొడవ జరగటంతో విజిలెన్స్ అధికారులు భక్తులను క్యూలైన్ నుంచి పక్కకు తీసుకెళ్లారు.

అయితే శ్రీవారి భక్తుల మధ్య గొడవకు తోసివేయడమే కారణమని తెలిసింది. క్యూలైన్‌లో చిన్న పిల్లలతో వస్తున్న మహిళలను కొంతమంది తోసినట్లు తెలిసింది, దీంతో భక్తుల మధ్య మాటామాటా పెరిగి.. అది కాస్తా కొట్టుకునే వరకూ వెళ్లినట్లు సమాచారం. శ్రీవారి ఆలయ పేష్కార్ రామకృష్ణ అక్కడకు చేరుకుని వారిని వారించే ప్రయత్నం చేశారు. అలాగే విజిలెన్స్, పోలీస్ సిబ్బంది కూడా ఆపేందుకు యత్నించారు. వినకపోవటంతో చివరకు విజిలెన్స్ సిబ్బంది భక్తులను అక్కడి నుంచి పక్కకు తీసుకెళ్లారు. అయితే వేసవి రద్దీ నేపథ్యంలో తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగిందని.. దీంతో తిరుమల శ్రీవారి దర్శనం సమయం కూడా పెరిగిందని అధికారులు చెప్తున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని భక్తులు కాస్త సంయమనంతో వ్యవహరించాలని.. ఓపికగా ఆ వేంకటేశ్వరుడి దర్శనం చేసుకోవాలని సూచిస్తున్నారు.

### తిరుమల హుండీకి రికార్డు ఆదాయం...

మరోవైపు వీకెండ్ కావటం, వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలకు భక్తుల రద్దీ పెరిగింది. శనివారం 84,113 మంది భక్తులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. 33,868 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కానుకల ద్వారా తిరుమల శ్రీవారి హుండీకి శనివారం రికార్డు స్థాయిలో రూ.4.12 కోట్ల ఆదాయం వచ్చింది. మరోవైపు భక్తుల రద్దీ కారణంగా 31 కంపార్టుమెంట్లలో భక్తులు దర్శనం కోసం వేచిచూస్తున్నట్లు టీటీడీ తెలిపింది. తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి సుమారుగా 15 గంటల సమయం పడుతున్నట్లు తెలిపింది.

# టీటీడీకి బెంగళూరు భక్తుడి భారీ విరాళం..

**తిరుమల:** టీటీడీకి మరో భారీ విరాళం అందింది. బెంగళూరుకు చందిన సుయుగ్ వెంచర్స్ అనే సంస్థ టీటీడీకి రూ.1.50 కోట్లు విరాళంగా అందించింది. సుయుగ్ వెంచర్స్ ఛైర్మన్ యతీష్ సూరినేని ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు ఈ విరాళం అందించారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడును కలిసి ఆయన చేతికి ఈ విరాళం అందించారు. మరోవైపు తిరుపతిలోని కోదండరామాలయంలో శనివారం పుష్పయాగం ఘనంగా జరిగింది. మూడు టన్నుల పూవులతో స్వామివారికి అత్యంత వైభవంగా పుష్పయాగం నిర్వహించారు.

తిరుమల శ్రీవారికి మరో భారీ విరాళం అందింది. బెంగళూరుకు చెందిన సంస్థ టీటీడీకి కోటీ 50 లక్షల రూపాయలు విరాళంగా ప్రకటించింది. టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు బెంగళూరుకు చెందిన సుయుగ్ వెంచర్స్ ఎల్ఎల్‌పీ అనే సంస్థ రూ.1.50 కోట్లు విరాళంగా అందించింది. సుయుగ్ వెంచర్స్ ఎల్ఎల్‌పీ కంపెనీ ఛైర్మన్ యతీష్ సూరినేని.. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడును ఆదివారం కలిసి విరాళం తాలూకు చెక్కును ఆయన చేతికి అందజేశారు. ఈ సందర్భంగా దాతను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అభినందించారు. తిరుమల శ్రీవారిని దర్శించుకునే భక్తులు హుండీల ద్వారా శ్రీవారికి తమ కానుకలు సమర్పించుకుంటూ ఉంటారు. మరికొంతమంది భక్తులు టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ట్రస్టులకు విరాళాలు అందిస్తూ శ్రీవారి కృపకు పాత్రులవుతూ ఉంటారు. ఈ క్రమంలోనే టీటీడీ ట్రస్టులకు భారీగా విరాళాలు అందుతూ ఉంటాయి.





శ్రీవారి ఆలయ నిర్మాణ ట్రస్ట్, ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్, శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీమ్, ప్రాణదాన ట్రస్టు ఇలా అనేక ట్రస్టుల ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యాలతో పాటుగా, సామాజిక సేవా కార్యక్రమాలను కూడా చేపడుతోంది. దీంతో తిరుమల శ్రీవారి దర్శనం కోసం ఏడుకొండలకు వచ్చే వీఐపీలు, పారిశ్రామికవేత్తలు టీటీడీ ట్రస్టులకు విరాళం అందించి సామాజిక సేవా కార్యక్రమాల్లో తాము కూడా భాగమవుతుంటారు. ఇక దాతల నుంచి వచ్చే విరాళాలను తిరుమల శ్రీవారి భక్తుల సౌకర్యాలను మెరుగుపరచడానికి, టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఆలయాల నిర్వహణకు అధికారులు ఉపయోగిస్తూ ఉంటారు.

మరోవైపు తిరుపతిలోని శ్రీ కోదండరామాలయంలో శనివారం పుష్పయాగాన్ని టీటీడీ ఘనంగా నిర్వహించింది. కార్యక్రమంలో భాగంగా స్వామివారికి స్నపన తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అర్చకుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య పుష్పయాగం అత్యంత వైభవంగా జరిగింది. తులసి, చామంతి, గన్నేరుపూలు, మల్లెలు, రుక్షి, కనకాంబరాలు, రోజాపూలు, తామర, కలువ, మొగలిరేకులు వంటి 12 రకాల పూలతో పాటు, ఆరు రకాల ఆకులను కలిపి పుష్పయాగం నిర్వహించారు. పుష్పయాగంలో మొత్తం 3 టన్నుల పూలను ఉపయోగించారు.

ఈ మూడు టన్నుల పూలను ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన దాతలు అందజేశారు. శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని పుష్పయాగం చేపట్టడం ఆనవాయితీ.

> టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు బెంగళూరుకు చెందిన సుయుగ్ వెంచర్స్ ఎల్ఎల్‌పీ అనే సంస్థ రూ.1.50 కోట్లు విరాళంగా అందించింది. సుయుగ్ వెంచర్స్ ఎల్ఎల్‌పీ కంపెనీ ఛైర్మన్ యతీష్ సూరినేని.. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడును ఆదివారం కలిసి విరాళం తాలూకు చెక్కును ఆయన చేతికి అందజేశారు. ఈ సందర్భంగా దాతను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అభినందించారు.

# లేడీస్ హాస్టల్‌లో సీక్రెట్ కెమరాలు..

**ఆంధ్రప్రదేశ్:** గుంటూరులో ఒక లేడీస్ హాస్టల్‌లో సీక్రెట్ కెమెరాలు కలకలం రేపాయి. బ్రాడీపేటలోని శ్రీనివాసన్ హాస్టల్‌లో బాత్రూమ్ ముందు కెమెరాలు పెట్టి వీడియోలు తీస్తున్నారని విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. గతంలో కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో, సంగారెడ్డిలోని గర్ల్స్ హాస్టల్‌లో ఇలాంటి ఘటనలు వెలుగులోకి వచ్చాయి.



మహిళల భద్రతకు సంబంధించి సురక్షితమైన ప్రాంతం అంటూ ఏది లేకుండా పోతుంది. ఇంటా.. బయట ఆడవారికి వేధింపులు తప్పడం లేదు. ఇక విద్య, ఉద్యోగం నిమిత్తం హాస్టల్స్‌లో ఉండే వారి పరిస్థితి భయంకరంగా తయారయ్యింది. హాస్టల్ యాజమాన్యం నిర్లక్ష్యం, తోటి వారి స్వార్థం కారణంగా లేడీస్ హాస్టల్‌లో సీక్రెట్ కెమరాలు, రహస్యంగా ఫొటోలు, వీడియోలు చిత్రీ కరిస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఏపీలో దారుణం చోటు చేసకుంది. లేడీస్ హాస్టల్‌లో సీక్రెట్ కెమెరాల వ్యవహారం కలకలం రేపుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో లేడీస్ హాస్టల్‌లో సీక్రెట్ కెమెరాలు కలకలం రేపాయి. గుంటూరు బ్రాడీపేటలోని శ్రీనివాసన్ లేడీస్ హాస్టల్‌లో బాత్రూం ముందు కెమెరాలు పెట్టి వీడియోలు చిత్రీకరిస్తున్నారంటూ పలువురు విద్యార్థునులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. అర్ధరాత్రి సమయంలో అసభ్యకరంగా ఫోన్‌లు మాట్లాడటం.. అబ్బాయిల్ని తీసుకొని వచ్చి లేడీస్ హాస్టల్లో ఉంచడం వంటి దారుణాలకు పాల్పడుతున్నారంటూ హాస్టల్ విద్యార్థినిలు పోలీసులకు తెలిపారు. స్టూడెంట్స్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పోయిన సంవత్సరం.. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో సీక్రెట్ కెమెరాల వ్యవహారం రెండు తెలుగు రాష్ట్రాలను కుదేపిసిన సంగతి తెలిసిందే. ఇంజనీరింగ్ కాలేజీ లేడీస్ హాస్టల్ బాత్రూమ్‌లో హిడెన్ కెమెరా బయటపడింది. దాంతో విద్యార్థినులు హాస్టల్ ప్రాంగణంలో అర్ధరాత్రి ఆందోళన చేపట్టారు. ఈ కెమెరా ద్వారా చిత్రీకరించిర వీడియోలను బయట అమ్ముతు న్నాడంటూ బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థిపై దాడికి యత్నించారు విద్యార్థినులు.

ఇక ఈ సంవత్సరం మార్చి నెలలో తెలంగాణలో కూడా ఈ తరహా దారుణం ఒకటి వెలుగులోకి వచ్చింది. సంగారెడ్డి జిల్లాలోని ఓ గర్ల్స్ హాస్టల్‌లో స్పై కెమెరా వెలుగు చూడటం సంచలనంగా మారింది. హాస్టల్‌లో ఉండే విద్యార్థినిలు స్పై కెమెరాను గుర్తించి.. అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన హాస్టల్ నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు. ఇలా తరచుగా ఏదో ఒక చోట ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తుండటంతో.. ఆడపిల్లలను బయటకు పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడే పరిస్థితులు నెలకొని ఉన్నాయి.

# డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం శుభవార్త..

**ఆంధ్రప్రదేశ్:** ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. సాంకేతికతను అందిపుచ్చుకు ంటూ.. ప్రజా పాలన అందిస్తోంది. దీని ద్వారా వందల ప్రభుత్వ సర్వీసులు ప్రజల అర చేతుల్లోకి వచ్చి చేరాయి. దాంతో ప్రజలు ఇంట్లో నుంచే ప్రభుత్వ సర్వీసులు సులభంగా పొందవచ్చు. తాజాగా ఏపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు శుభవార్త చెప్పింది. వారు ఇకపై ఇంటి వద్ద నుంచే డ్వాక్రా రుణాలు, పొదుపు చెల్లించిలే.. వారి కోసం ఓ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది.



### డ్వాక్రా మహిళల కోసం యాప్..

డ్వాక్రా రుణ వాయిదాల చెల్లింపు కోసం మహిళలు ప్రతీ నెల బ్యాంకులకు వెళ్తుంటారు. అక్కడకు వెళ్లి గంటల తరబడి క్యూలైన్లో నిలబడి అవస్థలు పడుతుంటారు. ఈక్రమంలో ఏపీ ప్రభుత్వం.. ఈ సమస్యలను అధిగమించేందుకు, స్వయం సహాయక సంఘాల రుణ చెల్లింపు సులభం చేసేలా.. వారి కోసం ఓ యాప్ తీసుకొచ్చే ఆలోచనలో ఉంది. ఈ కొత్త మొబైల్ యాప్‌తో స్వయం సహాయక సంఘాల సభ్యులు చాలా సులభంగా, పారదర్శకతతో రుణాల చెల్లింపులను సులభతరం చేసే అవకాశం ఉంది.

డ్వాక్రా రుణాల చెల్లింపు కోసం గ్రూప్ తరపున ప్రతి నెలా ఒకరు డబ్బులు వసూలు చేసి వాటిని బ్యాంకుల్లో జమ చేస్తుంటారు. ఒక వ్యక్తి పని మానుకుని.. రోజంతా దీని కోసమే కేటాయించాల్సి వస్తుంది. అలానే స్త్రీనిధి రుణాలకు సంబంధించి వసూలు చేసిన వాళ్లు బ్యాంకులో నగదు జమ చేయక పోవడం వంటి సంఘటనలు జరుగు తున్నాయి. వీటి పరిష్కారం కోసం ప్రభుత్వం రుణ చెల్లింపు ప్రక్రియను ఆన్ లైన్ చేయాలని భావించింది. దీనిలో భాగంగా డ్వాక్రా రుణ చెల్లింపు యాప్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

### యాప్ వల్ల లాభాలు..

ఈ యాప్ అందుబాటులోకి వస్తే.. డ్వాక్రా సభ్యులు తమ రుణ వాయిదాల చెల్లింపు కోసం బ్యాంకుకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇంటి నుంచే వాయిదాలు చెల్లించుకోవచ్చు. అంతేకాక యాప్ వినియోగం వల్ల డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించవచ్చు. నగదు బదిలీ మోసాలు తగ్గుతాయి. తక్షణ చెల్లింపుతో సభ్యుల సమయం ఆదా అవుతుంది.

### డ్వాక్రా మహిళలకు భారీగా రుణాలు

డ్వాక్రా మహిళలకు కూటమి సర్కార్ భారీ సంఖ్యలో రుణాలు ఇవ్వడంతో పాటుగా వాటితో ఆర్థిక స్వావలంబన సాధించేందుకు చర్యలు కూడా తీసుకుంటుంది. వచ్చే ఏడాది మార్చి లోపు 89 లక్షల మంది డ్వాక్రా మహిళలకు రూ.61,964 కోట్ల రుణాలు ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే డ్వాక్రా మహిళలు కోరుకున్న రంగాల్లో వారికి శిక్షణ అందించేందుకు ప్రభుత్వం ఒక ప్రణాళిక సిద్ధం చేసింది. అగ్రికల్చర్, ఫిషరీస్, హార్టికల్చర్, పశుసంపద, సెరీకల్చర్ ఇతర రంగాలకు సంబంధించి ప్రభుత్వం డ్వాక్రా రుణాలు మంజూరు చేయనుంది.

# తెల్లరేషన్ కార్డు ఉంటే చాలు.. 50 శాతం రాయితీ..

రైతులు, పశువుల పెంపకందారులకు ఉపయోగప డేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. వేసవి కాలంలో పశుగ్రాసం దొరక్క పశువుల పెంపకందారులు ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారికి ఊరట కలిగిస్తూ 50 శాతం రాయితీపై రైతులకు పశువుల దాణా పంపిణీ చేయాలని ఏపీ పశు సంవర్ధక శాఖ నిర్ణయించింది. 50 కేజీల బస్తాను రూ.1100లకు కొనుగోలు చేసి రైతులకు రూ.555లకు అందించాలని నిర్ణయించింది. తెల్ల రేషన్ కార్డు కలిగిన రైతులు, పశువుల పెంపకందారులు ఇందుకు అర్హులు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని పశువుల పెంపకం దారులకు ఏపీ ప్రభుత్వం ఊరట నిచ్చే నిర్ణయం తీసుకుంది. ఎండాకాలం కావటంతో పశువులకు పచ్చగడ్డి దొరకటం కష్టం. దీంతో పశువులకు సరైన పోషణ లేక పాల దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పశువుల పెంపకందారులకు ఉపయోగపడేలా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రైతులకు 50 శాతం రాయితీపై దాణా అందించాలని నిర్ణయించింది.

> రైతులకు పశువుల దాణా పంపిణీ చేయాలని ఏపీ పశుసంవర్ధక శాఖ నిర్ణయించింది. 50 కేజీల బస్తాను రూ.1100లకు కొనుగోలు చేసి రైతులకు రూ.555లకు అందించాలని నిర్ణయించింది. తెల్ల రేషన్ కార్డు కలిగిన రైతులు, పశువుల పెంపకందారులు ఇందుకు అర్హులు.

20 శాతం ప్రోటీన్ కలిగిన బలవర్ధకమైన దాణాను 50 శాతం రాయితీపై రైతులకు అందించాలని ఏపీ పశుసంవర్ధక నిర్ణయం తీసుకుంది. 50 కేజీల దాణా బస్తాను రూ. 1100 చొప్పున కొని రైతులకు రూ.555 లకే అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాయితీ కల్పించడం ద్వారా ఆర్థికంగా ప్రభుత్వం మీద భారం పడినప్పటికీ వేసవి కాలంలో పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు, పాల దిగుబడి తగ్గకుండా చూసుకునేందుకు ఈ నిర్ణయం ఉపయోగ పడుతుందని అధికారులు చెప్తున్నారు.

### ఏపీ యువతకు గుడ్ న్యూస్..

మరోవైపు ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా 21 లక్షల మంది పశువుల పెంపకందారులకు లబ్ధి కలగనుంది. వ్యవసాయం చేసే రైతులు సేద్యంతోపాటు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పశువుల పెంపకం, కోళ్ల పెంపకం వంటి పనులు చేపడుతూ ఉంటారు. అయితే ఎండాకాలం కావటంతో పశుగ్రాసం దొరక్క ఇబ్బందులు పడతారనే ఉద్దేశంతో వారికి ఉపయోగ పడేలా 50 శాతం రాయితీతో రైతులకు పశువుల దాణా అందించాలని ఏపీ పశుసంవర్ధక శాఖ నిర్ణయించింది. ఈ పశువుల దాణాను కిలో రూ.22.11 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. రైతు సేవాకేంద్రాలు, పశు వైద్యశాలల ద్వారా రూ.11.10కు అందించనున్నారు.

### రాయితీ పొందేందుకు అర్హతలు

50 శాతం రాయితీతో పశువుల దాణా పొందేందుకు తెల్ల రేషన్ కార్డు కలిగినవారు అర్హులు. ఒక్కో కుటుంబానికి 2 పెద్ద పశువులు, ఒక దూడకు కలిపి గరిష్టంగా 90 రోజులకు పశువుల దాణాను అందిస్తారు. విడతల వారీగా 450 కిలోల పశువుల దాణాను సబ్సిడీ మీద అందజేస్తారు. ఇక ఇందుకోసం ఏపీ ప్రభుత్వం రూ.69 కోట్లు ఖర్చు చేయనుంది. మొత్తం 31,067 టన్నుల పశువుల దాణాను ఏపీ పశు సంవర్ధక శాఖ పంపిణీ చేయనుంది. అర్హులం దరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు కోరుతున్నారు. వేసవి కాలంలో పశువుల పోషణకు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని.. పాల దిగుబడి దక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# సీఐ గొప్ప మనసు.. అనాథకు అన్నీతానై అంత్యక్రియులు

యోగి సినిమాలో హీరో ప్రభాస్.. అనాథలు చనిపోతే వారికి అంత్యక్రియులు నిర్వహిస్తుంటాడు. అచ్చం అలాగే నెల్లూరు జిల్లా వెంకటగిరి సీఐ వెంకటరమణ సైతం ఓ అనాథ చనిపోతే తన సొంత ఖర్చులతో అంత్యక్రియులు నిర్వహించారు. ఏ సంబంధం లేదని ఆయన.,అనాథ పాడె మోసి తన గొప్ప మనసును చాటుకున్నారు. సొంత మనుషులు చనిపోతే అంతిమయాత్రను ఎలా చేపడతారో అచ్చం అలాగే... డప్పులు.. మేళతాళలతో పోలీసులు ఆ అనాథకు అంత్యక్రియులు నిర్వహించారు. స్థానిక ఆటోవాలాలు సహకారం అందించినట్టు సీఐ వెంకటరమణ తెలిపారు.



# ప్రతిష్టాత్మక సంస్థ.. శరవేగంగా నిర్మాణం..



**అమరావతి:** రాజధాని అమరావతిలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నిర్మాణం దాదాపుగా పూర్తి కావొచ్చింది. వచ్చే ఏడాది మార్చి నాటికి అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో వేగంగా పనులు చేపడుతున్నారు. అమరావతి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నిర్మాణం పూర్తి కావొచ్చిందని.. ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. రూ.250 కోట్లతో ఈ నిర్మాణ పనులు చేపట్టారు. ఐదు ఎకరాల్లో అమరావతి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నిర్మాణానికి 2017లో శంకుస్థాపన జరగ్గా.. రాష్ట్రంలో అధికారం మారటంతో తుళ్లూరు ఫోరెన్సిక్ ప్రయోగశాల నిర్మాణం కూడా ఆగిపోయింది.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి టీడీపీ కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అమరావతి పునఃప్రారంభోత్సవం కూడా జరిగింది. ఈ సందర్భంగా అమరావతిని మూడేళ్లలోగా పూర్తి చేస్తామని.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అమరావతి ప్రారంభోత్సవానికి ఆహ్వానిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఇక ప్రధానమంత్రి కూడా అమరావతి నిర్మాణానికి కేంద్రం నుంచి పూర్తి స్థాయిలో సహకారం ఉంటుందని.. ఏపీ ప్రభుత్వానికి భుజం కాస్తామంటూ భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే అమరావతి నిర్మాణ పనులు మరింత వేగం పుంజుకున్నాయి. మరోవైపు తుళ్లూరులో రాష్ట్ర స్థాయి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఫోరెన్సిక్ ప్రయోగశాల భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. వచ్చే ఏడాది మార్చిలో ప్రారంభోత్స వానికి అమరావతి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ సిద్ధమవుతోంది.

ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయని ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. 2026 మార్చి నాటికి ఫోరెన్సిక్ ల్యాబొరేటరీని అందుబాటులోకి తెస్తామని తెలిపారు. రూ.250 కోట్ల వ్యయంతో తుళ్లూరులో ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ నిర్మాణం జరుగుతోంది. ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఈ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీని నిర్మిస్తున్నారు. నేరస్థుల అన్వేషణ, నేర నిరూపణలో శాస్త్రీయ ఆధారాల విశ్లేషణ కోసం ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ అవసరం.

ఈ నేపథ్యంలోనే అమరావతిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ నిర్మించాలని 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా 2017 డిసెంబర్‌లో తుళ్లూరులో శంకుస్థాపన చేశారు. అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

అయితే 2019 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో.. అమరావతి పనులు ఆగిపోయాయి. వాటితో పాటే తుళ్లూరు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నిర్మాణం కూడా నిలిచిపోయింది. అయితే 2024లో ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అమరావతి పనులు తిరిగి ప్రారంభమయ్యాయి.

ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నిర్మాణం కూడా జోరందుకుంది. మూడు బ్లాక్‌లలో ల్యాబొరేటరీ నిర్మాణం జరుగుతోంది. ఈ ఫోరెన్సిక్ ల్యాబొరేటరీలో డీఎన్ఏ, నార్కోటిక్స్, బయోమెట్రిక్స్, సైబర్, ట్రైనింగ్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాలు. బాలిస్టిక్స్, ఫోరెన్సిక్ అకౌంటింగ్‌కు సంబంధించిన ఎక్స్‌లెన్స్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

# నా కాన్వాయ్ కోసం ప్రజలను ఇబ్బంది పెడతారా?

- సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్
- జనాలను ఇబ్బంది పెట్టొద్దన్న సీఎం
- డీజీపీ సీవీ ఆనంద్‌కు ఆదేశాలు జారీ





**హైదరాబాద్, మే 6 :** తన కాన్వాయ్ కారణంగా సామాన్యులకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చూడాలని డీజీపీ సీవీ ఆనంద్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. తన పర్యటనల సమయంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలని డీజీపీని సీఎం ఆదేశించారు. ప్రజలను గంటల తరబడి రోడ్లపై నిలిపివేయొద్దని డీజీపీకి సూచించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా ఎయిర్‌పోర్టు వద్ద ట్రాఫిక్ జామ్‌పై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాన్వాయ్ కోసం ప్రజల పనులకు ఆటంకం కలిగించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎదురుగా వచ్చే వాహనాలను కూడా ఆపి ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. సీఎం ఆదేశాల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ కమిషనర్లతో డీజీపీ సీవీ ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ట్రాఫిక్ సమస్యలపై క్షేత్రస్థాయి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం త్వరలో 'ట్రాఫిక్ బ్యూరో' ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ ప్రకటించారు. కాన్వాయ్ వెళ్లే సమయంలో ట్రాఫిక్ పూర్తిగా ఆపకుండా సింగిల్ లైన్‌లో వాహనాలు పంపే ప్రణాళికను రూపొందించాలని నిర్ణయించారు. రద్దీ సమయంలో ప్రత్యామ్నాయ మార్గాలు ముందుగానే సిద్ధం చేయాలని అధికారులకు డీజీపీ సూచించారు. ఎయిర్‌పోర్టు పరిసరాల్లో అప్రమత్తంగా ఉండాలని డీజీపీ ఆదేశించారు. వర్షాకాలం ముందు.. నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. సిబ్బందిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని.. ఔటర్ రింగ్ రోడ్డుపై అక్రమ పార్కింగ్ నివారణపై దృష్టి సారించాలన్నారు. ఐఎస్‌డబ్ల్యూ, సీఎస్‌డబ్ల్యూ విభాగాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల విభాగం కూడా ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వామ్యం అవ్వాలని అధికారులకు డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు.

## తమిళనాడు అసెంబ్లీ రద్దు

- ఉత్తర్వులు ఇచ్చిన గవర్నర్ విశ్వనాథ్
- నేటి విజయ్ ప్రమాణ స్వీకారం వాయిదా
- తమిళనాట మారుతున్న రాజకీయ సమీకరణాలు
- ఏకమవుతున్న డిఎంకె, అన్నాడిఎంకె పార్టీలు

**చెన్నై, మే 6 :** తమిళనాడులో టీవికే ప్రభుత్వం ఏర్పాటుపై ఓవైపు సస్పెన్స్ కొనసాగుతుండగా, మరోవైపు తమిళనాడు 16వ శాసనసభ (2021-26)ను గవర్నర్ రాజేంద్ర ఆర్లేకల్ బుధవారంనాడు రద్దు చేశారు. ఈనెల 5 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వచ్చినట్టు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. బలనిరూపణకు అవసరమైన మద్దతు లేఖలు అందించని కారణంగా విజయ్ పార్టీని కూడా గవర్నర్ ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించలేదు. దీంతో నేటి విజయ్ ప్రమాణం రద్దయ్యింది. మరోవైపు డిఎంకె పార్టీలు అనూహ్యంగా రంగంలోకి దిగాయి. కలసి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు చర్చలు మొదలు పెట్టినట్లు సమాచారం. దీంతో వారి బలం 120కి ఉన్నట్లుగా సామాచరం. ఇందులో కాంగ్రెస్, బిజెపిలను దూరం పెట్టాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. మరోవైపు ఈనెల 7న ప్రభుత్వం ఏర్పాటు చేయాలని విజయ్ సారథ్యంలోని టీవీకే ఆలోచనగా ఉంది. ఇందుకు ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో ప్రమాణస్వీకారం మరింత జాప్యమయ్యే అవకాశం ఉంది. తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను విజయ్ కలిశారు. కాంగ్రెస్ ఇచ్చిన మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతి కోరారు. అయితే విజయ్ చూపిన సంఖ్యాబలంతో గవర్నర్ సంతృప్తి చెందలేదు. ప్రభుత్వం ఏర్పాటు టీవీకేకు తగినంత సంఖ్యాబలం లేదని భావించిన గవర్నర్ 118 మంది సభ్యులు సమకూరిన తర్వాత రావాలని సూచించినట్టు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. ఎన్నికల్లో టీవీకే 108 చోట్ల గెలిచింది. అయితే ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 118 మంది సభ్యుల బలం సంపాదించలేకపోయింది. డీఎంకేతో పొత్తులో భాగంగా 5 సీట్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీ విజయ్‌కు మద్దతు ప్రకటించింది. విజయ్ గెలిచిన రెండు సీట్లలో ఒక సీటును మినహాయిస్తే టీవీకే సంఖ్యాబలం 112కు చేరుకుంది. దీంతో మరో ఆరుగురి మద్దతు టీవీకేకు అవసరమైంది. ప్రస్తుతం టీవీకేకు ఎవరు మద్దతు ఇవ్వనున్నారనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. విజయ్‌కు మద్దతిచ్చే అవకాశాలను అన్నాడీఎంకే బుధవారంనాడు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. ఎడప్పాడి పళనిస్వామి నివాసంలో పార్టీ ఎమ్మెల్యేలు సమావేశమై టీవీకేకు సపోర్ట్ ఇవ్వరాదని నిర్ణయించారు. డీఎంకే భాగస్వామ్య పార్టీ అయిన వీసీకే మద్దతును టీవీకే కోరినప్పటికీ ఆ పార్టీ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వీసీకేకు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. టీవీకే ఆహ్వానం అందినప్పటికీ డీఎంకే భాగస్వాములుగా ఉన్న వామపక్షాలు, ఇండియన్ యూనియన్ ముస్లిం లిగ్ పార్టీలు టీవీకేకు సపోర్ట్ నిరాకరించాయి. ఈ పార్టీల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌ను కలుసున్నారు. అనంతరం డీఎంకేకు తమ మద్దతు కొనసాగుతుందని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన ఆరుగురు ఎమ్మెల్యేల బలాన్ని టీవీకే ఎలా కూడగట్టనుందనేది సస్పెన్స్‌గా మారింది.

## తెలంగాణలో నామినేటెడ్ పోస్టులు భర్తీ

### బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌గా బస్వరాజు శ్రీనివాస్

**హైదరాబాద్, మే 6 :** తెలంగాణ రాష్ట్రంలో పలు నామినేటెడ్ పోస్టుల భర్తీకి రేవంత్ రెడ్డి సర్కార్ శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం 17 కార్పొరేషన్లకు చైర్మన్లతోపాటు వైస్ చైర్మన్లను నియమించింది. మరికొన్ని కార్పొరేషన్ల చైర్మన్ల భర్తీని ఈ ఏడాది జులైలో చేపడతామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. బ్రహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌గా బస్వరాజు శ్రీనివాస్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా బండి రమేశ్ నియమితులయ్యారు. వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్: గట్టు తిమ్మప్ప, యాదవ కార్పొరేషన్ చైర్మన్: రఘునాథ్ యాదవ్, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్: గుంజా రేణుక హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్: దూదెం వెంకట రమణ, లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్: చరణ్ కౌశిక్,తెలుగు అకాడమీ చైర్మన్: ప్రొఫెసర్ వెంకట రమణ, వాషర్ మెన్ - డాక్టర్ అజయ్ కుమార్ గీత కార్మిక - చంద్ర శేఖర్ గౌడ్,పెరిక - గొంగరి వెంకటేశర్లు,మేర - సంగ వెంకట్ రాజం,మున్నూరు కాపు - బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి,పద్మశాలి - గూడూరి శ్రీనివాస్,వెలమ - జువ్వాడి నర్సింగ్ రావు ఉన్నారు.



## జూన్ 8న చేప ప్రసాదం పంపిణీ

### బత్తిని కుటుంబ సభ్యుల ప్రకటన

**హైదరాబాద్, మే 6 :** ఆస్తమా వ్యాధిగ్రస్తులకు అందించే చేప ప్రసాదం పంపిణీ జూన్ 8న ప్రారంభించనున్నట్లు బత్తిని కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఉబ్బసం, శ్వాస కోస వ్యాధులను వివారించేందుకు ఉచితంగా అందించే చేప ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మృగశిర కార్తె సందర్భంగా హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో చేప ప్రసాదం పంపిణీ ఉంటుందని బత్తిని మృగశిర ట్రస్టు నిర్వాహకులు, దివంగత బత్తిని హరినాథ్ కొడుకు అమర్నాథ్ గౌడ్ తెలిపారు. జూన్ 8వ తేదీన తమ కుటుంబ సభ్యులు చేప ప్రసాదం సేవించిన తర్వాత సాయంత్రం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానానికి తరలించనున్నట్లు తెలిపారు. ముహూర్తం ప్రకారం అదేరోజు రాత్రి 9 గంటలకు చేప ప్రసాదం పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. చేప ప్రసాదం పంపిణీకి ఇప్పటికే ఫిషరీ, ఎగ్జిబిషన్ గ్రౌండ్, పోలీస్ డిపాటమెంట్, జీహెఎంసీ, ప్రభుత్వం పర్మిషన్ తీసుకున్నామని బత్తిని కుటుంబ సభ్యులు అమర్‌నాథ్ గౌడ్, గౌరీ శంకర్ గౌడ్, అనిరుధ్ గౌడ్, దుర్గా గౌడ్ మంగళవారం తెలిపారు. సుమారు 180 ఏండ్లకు పైగా చేప ప్రసాదం పంపిణీ జరుగుతోందని, ఎక్కడా ఎవరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌ఛైర్‌తో పాటు అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేశామని తెలి పారు. రెండు శతాబ్దాలుగా బత్తిని కుటుంబం చేపప్ర సాదం పంపిణీ చేస్తోందని తెలిపారు. ఆస్తమా, ఉబ్బసం, దమ్ము, దగ్గు వంటి శ్వాశ సంబంధ వ్యాధుల నివారణకు మృగశిర కార్తె ప్రవేశించిన ఘడియల్లో ఓ పదార్థాన్ని చేప ద్వారా నోటిలో వేస్తామని ఆయన పేర్కొన్నారు.

## పారదర్శకంగా బదిలీల ప్రక్రియ

- ఉద్యోగుల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యత
- బదిలీల పక్రియ ఆదర్శంగా నిలిచేలా చేపట్టాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**హైద్రాబాద్, మే 6 :** ఉద్యోగుల సౌలభ్యం, సమానత్వం, పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ శాఖ పరిధిలో బదిలీల పక్రియను ఎలాంటి వివాదాలకు తావులేకుండా నిర్వహించాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఉద్యోగుల బదిలీల పక్రియను సంక్షేమ శాఖ పరిధిలో పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా అమలు చేయాలని సంక్షేమ శాఖ మంత్రి ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆశ్రమ పాఠశాలలు, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ, దివ్యాంగుల శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దూర ప్రాంతాల్లో దీర్ఘకాలం చాలా సేవలందించిన ఉద్యోగులకు వారు కోరుకున్న ప్రాంతాల్లో పోస్టింగులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న ఉద్యోగులు, దంపతులు ఒకే చోట పనిచేసే 'స్పౌస్ కేసులు' వంటి అంశాలను సానుకూలంగా పరిగణించాలని ఆదేశించారు. దుర్భర పరిస్థితుల్లో విధులు నిర్వహించిన వారికి మానవీయ దృక్పథంతో న్యాయం చేయాలని పేర్కొన్నారు. బదిలీలకు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించి వాటిని ఉద్యోగులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి దశలో డిజిటల్ పద్ధతులను వినియోగించి మానవ జోక్యం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి వేగంగా స్పందించాలని ఆదేశించారు. ఎలాంటి ఒత్తిడి లేదా ఇతర వ్యక్తిగత ప్రభావాలు లేకుండా నిష్పాక్షికంగా పక్రియ కొనసాగించాలని స్పష్టం చేశారు. గురుకుల సంస్థల్లో బోధన నాణ్యత దెబ్బతినకుండా అవసరమైన సిబ్బంది సమతుల్యతను కాపాడాలని చెప్పారు. మహిళా ఉద్యోగులు, దివ్యాంగులు, సీనియర్ ఉద్యోగులకు ప్రత్యేక సౌలభ్యాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. గురుకులాల్లో అమలు చేసిన 370 జీవో కారణంగా ఉద్యోగులు ఎదుర్కొన్న ఇబ్బందులను అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. 190 జీవో జారీ చేసినప్పటికీ అమలులో సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ?ఉక్త 190 జీవో అమలు సాధ్యాసాధ్యాలను సమగ్రంగా పరిశీలించి అమలు చేసేలా కృషి చేయాలన్నారు. ఉద్యోగులకు అన్యాయం జరగకుండా సమతుల్య నిర్ణయం తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఉద్యోగులు సంతృప్తిగా, మనశ్శాంతితో పనిచేసే వాతావరణం కల్పించడం ద్వారా బోధనలో నాణ్యత మరింత మెరుగవుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. సంక్షేమ శాఖలో బదిలీల పక్రియను ఆదర్శంగా నిలిచే విధంగా నిర్వహించాలని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.



## పోలీస్ అధికారినే ఆటపట్టించిన పోకిరీలు

**హైదరాబాద్, మే 6 :** ఆమె ఓ పోలీస్ ఉన్నతాధికారి. ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు స్వయంగా తానే రంగంలోకి దిగింది. ఆవిడే మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి. ఇటీవలే మల్కాజిగిరి సీపీగా బాధ్యతలు చేపట్టిన ఆమె బుధవారం అర్ధరాత్రి కీలక ఆపరేషన్ చేపట్టి సీపీగా కాకుండా సగటు మహిళగా బస్టాండ్‌లో ఒంటిరిగా నిలబడింది. దీంతో అక్కడ ఉన్నది సీపీ సుమతి అని తెలియక సుమారు 40 మంది పోకిరీలు ఆమె చుట్టూ చేరి రకరకాల ప్రశ్నలతో వేధించారు. ఇందులో ఎక్కువ మంది విద్యార్థులే ఉండటం గమనార్హం. ఈ క్రమంలో సీపీ సాధారణ మహిళలు పడే ఇబ్బందులను తాను ఎదుర్కొన్నారు. ఆ తర్వాత అక్కడికి చేరుకున్న పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు.

## కాల్వలనాగరం రిజర్వ్ ఫారెస్ట్ భూములపై సుప్రీం కీలక తీర్పు

### 600 ఎకరాల భూమిపై దాఖలైన పిటిషన్ కొట్టివేత

**న్యూఢిల్లీ, మే 6 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం కాల్వలనాగరంలోని రిజర్వ్ ఫారెస్ట్ భూములపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. 600 ఎకరాల భూమిపై దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. రెవెన్యూ రికార్డులు కేవలం పన్నుల వసూలుకే అని స్పష్టం చేసింది. అవి యాజమాన్య హక్కులను కల్పించవని పేర్కొంది. ఈ వ్యవహారంలో గతంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టి ధర్మాసనం సమర్థించింది. సర్వే నంబర్ 81లోని 600 ఎకరాల భూమిని అటవీ భూమిగా గుర్తిస్తూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులు యథాతథమని స్పష్టం చేసింది. దాంతో 1950 నాటి నిజాం కాలపు ఫారెస్ట్ గెజిట్ నోటిఫికేషన్‌ను సవాలు చేసిన అప్పీలుదారులకు చుక్కెదురు అయింది. పట్టా సర్టిఫికేట్ లేకుండా కేవలం పహాణీలు, పట్టీల ఆధారంగా యాజమాన్య హక్కులు రావని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.రెవెన్యూ రికార్డులు కేవలం పన్నుల అవసరాల కోసం మాత్రమేనని వెల్లడించింది. అప్పీలుదారులు తమ కెలయిమ్‌ను నిరూపించే అసలు డాక్యుమెంట్లు సమర్పించ లేదని సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ సందర్భంగా పేర్కొంది. ఈ భూములపై దశాబ్దాలుగా సాగుతున్న న్యాయ పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో తెరదించినట్లు అయింది.

## పలు గ్రామాల్లో గాలివాన బీభత్సం

**సిద్దిపేట, మే 6 :** గాలి వాన బీభత్సం సృష్టించడంతో జన జనజీవనం అతలకుతలమైంది. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి గాలి వాన బీభత్సం సృష్టించడంతో చేతికి వచ్చిన వరి పంట నేల వాలింది. విద్యుత్ స్తంభాలు గాలివానకు కుప్పకూలాయి. రాత్రి నుంచి ఇప్పటివరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. భారీ గాలివాన రావడంతో కొత్తపల్లి,టేంకంపేట, రాంసాగర్ గ్రామాలకు వెళ్లే రహదారిపై భారీ వృక్షాలు రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 11కేవి విద్యుత్తు స్తంభాలు గాలివానకు కిందపడి పోవడంతో పెను ప్రమాదం తప్పింది. మండల కేంద్రంలో గాలివానకు రేకుల షెడ్లు ఎగిరి రోడ్డుపై పడ్డాయి. వందల ఎకరాల్లో వరి పంట చేతికి వచ్చిన సమయంలో నేలరాడంతో రైతులకు నష్టం జరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు గ్రామాల్లో తిరుగుతూ విద్యుత్ పునరుద్ధరణ కోసం చర్యలు తీసుకుంటున్నారు. కొత్తపల్లి సర్పంచ్ శ్యామల ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో రోడ్డుపై ఉన్న భారీ వృక్షాలను తొలగించి రాకపోకలను సరి చేశారు. పలు గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించడంతో మండల వ్యాప్తంగా పంటలకు నష్టం వాటిల్లింది. విద్యుత్ సరఫరా లేకపోవడంతో మండల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

- సిఎం అభ్యర్థిపై బిజెపిలో సమాలోచనలు
- ప్రమాణస్వీకారానికి భారీగా ఏర్పాట్లు

**కోల్‌కతా, మే 6 :** పశ్చిమ బెంగాల్‌లో స్పష్టమైన ఆధిక్యం సాధించడంతో భారతీయ జనతా పార్టీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుంది. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే అంశంపై పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. వారిలో ఒకరిని ఎంపిక చేసేందుకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం రాష్ట్రానికి చెందిన కీలక నేతలతో వరుసగా చర్చలు జరుపుతోంది. దీనిపై కసరత్తు జరుగుతుండగానే 9న ప్రమాణ స్వీకార ఏర్పాట్లు సాగుతున్నారు. బెంగాల్ నేత ఎంపికకు పరిశీలకుడిగా కేంద్రహోంమంత్రి అమిత్ షా రానున్నారు. అందుకే మే 9వ తేదీ శనివారం ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య బుధవారం కోల్‌కతాలో ప్రకటించారు. ఉదయం10 గంటలకు మహానగరంలోని ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. గురువారం సాయంత్రం కోల్‌కతాలో శాసనసభా పక్ష సమావేశం జరుగుతుందని సమీక్ భట్టాచార్య తెలిపారు. ఈ సమావేశంలో శాసనసభా పక్ష నేతను పార్టీ ఎమ్మెల్యేలు అంతా కలిసి ఎన్నుకుంటారని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్రం మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీయే నాయకులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. కార్యక్రమానికి పార్టీ సీనియర్ నేతలతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవుతారని పార్టీ నేతలు చెబుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా కొలువుదీరనున్న మంత్రి వర్గంలో దాదాపు 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర నాయకత్వం చెబుతుంది. మరోవైపు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాట్లపై ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇప్పటికే దృష్టి కేంద్రీకరించారు.

## పాపికొండలు యాత్రకు తాత్కాలిక బ్రేక్

**రాజమండ్రి, మే 6 :** రెండు తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు అధికారులు సూచన చేశారు. గోదావరి నదిలో అత్యంత ఆదరణ పొందిన 'పాపికొండలు విహార యాత్ర' ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జలవనరుల శాఖ ప్రకటించింది. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురుస్తుండటంతో పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాపికొండలు యాత్రను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడి, పర్యావరణం అనుకూలించిన తర్వాతనే విహార యాత్రను పునరుద్ధరిస్తామని యంత్రాంగం వెల్లడించింది. యాత్ర పునఃప్రారంభానికి సంబంధించిన తదుపరి వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని, అప్పటివరకు పర్యాటకులు అధికారులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా నదీ ప్రవాహంలో ప్రమాదాలు జరగకుండా ముందుజాగ్రత్తగా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## ప్రభుత్వ సలహాదారుగా మాజీ డీజీపీ నియామకం

### స్టే విధించాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు

**హైదరాబాద్, మే 6 :** తెలంగాణ రాష్ట్ర భద్రతా సలహాదారుగా మాజీ డీజీపీ బి. శివధర్ రెడ్డి నియామకం సవాల్ చేస్తూ హైకోర్టులో టి. ధన్‌పాల్ రావు పిటిషన్ దాఖలు చేశారు. ఆయన నియామకంపై ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 559పై స్టే విధించాలని హైకోర్టుకు ఆయన విజ్ఞప్తి చేశారు. తాత్కాలిక డీజీపీ నియామకంపై గతంలో దాఖలు చేసిన పిటిషన్‌కు అనుబంధంగా కొత్త అప్లికేషన్‌ను పిటిషనర్ కోర్టులో దాఖలు చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా డీజీపీ నియామకం జరిగిందని తన పిటిషన్‌లో ధన్‌పాల్ రావు స్పష్టం చేశారు. యూపీఎస్సీ నుంచి అర్హుల జాబితా తీసుకోలేదని పిటిషన్‌లో ఆయన ఆరోపించారు. ఆ పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే.. డీజీపీగా నియామకం జరిగిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. చీఫ్ సెక్రటరీ ర్యాంకులో ఆయనను నియమించడంపై పిటిషనర్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

## మమతా బెనర్జీ అహంకారం!



**ప్రజాస్వామ్యంలో నిరంకుశంగా ఉంటామంటే కుదరదు. ప్రజలు ఎన్నుకుంటే నేతలు.. లేదంటే అంతే సంగతులు. భారత ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజ్యాంగ బద్ధంగా ఉండాల్సిందే. కాదూకూడదంటే... కుదరదు. ఇటీవల ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసి.. ఫలితాలు కూడా వచ్చేశాయి, బెంగాల్లో బిజెపి అధికారం చేపట్టబోతోంది. తమిళనాడులో నటుడు విజయ్ స్థాపించిన టివికె పార్టీ అధికారం దక్కించు కుంది. ఇంతవరకు ఇవే పెద్ద మార్పులు. కేరళలో ఎల్‌డిఎఫ్ స్థానంలో యూడిఎఫ్ అధికారం కైవసం చేసుకుంది. అసోం, పాండిచ్చేరిల్లో పాత ప్రభుత్వాలే కొత్తగా కొలువుదీర బోతున్నాయి. ఈ క్రమంలో బెంగాల్లో గత పదేహేనేళ్ల మమతా బెనర్జీ పాలనలో అనేక అరాచకాలను చూశాం. తానూ బంగ్లాదేశ్‌లో లాగా ఓ దేశానికి రాణిని అని భ్రమిశారు. అడ్డూ అదుపులేకుండా అరాచకాలకు తెలేపారు. చొరబాటుదార్లకు గేట్లు తెరిచారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఇచ్చి వారిని పర్మినెంట్‌గా ఓటర్లను చేశారు. కానీ సర్ ప్రక్రియతో ఆమె ఆటలు సాగలేదు. అలాగే ఆమె తీరుతో ప్రజల్లో గూడుకట్టుకున్న ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఓట్ల రూపంలో తమ తీర్పును తెలిపారు. 95 శాతం మంది, అందులో మహిళల క్యూలు కట్టి మమతను ఓడించారు.**

ప్రజల తీర్పును గౌరవించాల్సిన మమతా బెనర్జీ తాను ఓడిపోలేదని, రాజీనామా చేయలనని, బిజెపి వందసీట్లు చోరీ చేసిందని దగుల్బాజీ మాటలు మాట్లాడారు. అసోం, బెంగాల్లో ఓట్ చోరీ జరిగిందని రాహుల్ కూడ వంతపాడారు. మరి తమిళనాడు, కేరళలో ఓట్ చోరీ ఎదుకు జరగలేదో రాహుల్ చెప్పాలి. రాహుల్ ఓట్ చోరీ పేరుతో ఇంకా నాటకాలు ఆడితే ప్రజలు క్షమించరని గుర్తించాలి. విపక్షనేత కూడా మతిభ్రమించి మాట్లాడడం అలవాటు చేసుకున్నారు. మమత బెనర్జీ తాను ఇండియాలో ఉన్న వెస్ట్ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశానని అనుకోవడం లేదు. బంగ్లాదేశ్‌లాగా తనది కూడా స్వతంత్ర రాజ్యం అనుకుంటున్నారు. అందుకే రాజ్యాంగం విలువ తెలియకుండా మాట్లాడుతున్నారు .ఆ రాజ్యంగమే ఆమెను 15 ఏళ్లపాటు సిఎంగా మోసిందని గుర్తించడం లేదు. ఓటమితో మమతలో అసహనం పెరిగింది. ఏం మాట్లాడాలో తెలియడం లేదు. రాహుల్ ఓట్‌చోరీని సీట్ల చోరీతో పోల్చి మాట్లాడారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని మమతా బెనర్జీ అంటున్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందువల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. రాజ్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి మీడియా సమావేశంలో మంగళవారం నాడు మమతాబెనర్జీ మాట్లాడుతూ.. రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు.

రాజీనామా చేయకుంటే బర్తరఫ్ చేస్తారని అసోం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ గట్టిగానే హెచ్చరించారు. 15 ఏళ్లపాటు ఇవిఎంలతోనే మమత గెలిచారు. ఇప్పుడేమో .. ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీచేశారని ఆరోపించడం చూస్తే మతి భ్రమించిందనే అనుకోవాలి. ఉద్దేశ్య పూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడించారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని కూడా చెప్పుకొచ్చారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోపణలు చేశారు. ఎస్‌ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించా రనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తుగడలు పన్ని 100 సీట్ల వరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు. నిజానికి గతంలో మమతా బెనర్జీ పకడ్బందీగా ఇవన్నీ చేశారు. మమతను సుప్రీం కూడా చీవాట్లు పెట్టింది. అయినా ఆమెలో మార్పు రాలేదు. ఆమెను 15 ఏళ్లు భరించడమే ఎక్కువ. ఇలాంటి నేతలు ఉన్నందుకు సిగ్గుపడాలి. ఉమ్మడిగా పోరాటం కోసం తాను 'ఇండి' కూటమిలోనే తాను కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు. అందుకేనేమో రాహుల్ కూడా ఆమె పట్ల సానుభూతి ప్రకటించారు. కేరళ, తమిళనాడు తప్ప అంతా ఓట్ చోరీ జరగిందని పాత ఆవుకథను మళ్లీ పదేపదే చెప్పారు. నిజానికి పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళం రాష్ట్రాల్లో పాలక పార్టీల, కూటములను ప్రజలు ఓడించి మార్పును కోరుకున్నారు.

దేశంలో ఎక్కడా ఉనికిని పెంచుకోలేక పోయిన కాంగ్రెస్‌కు కేరళంలో గెలుపు కొత ఊరటనిచ్చేదిగా ఉంది. కేరళంలో వరుసగా రెండు తడవలు అసాధారణంగా గెలిచిన వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం ఓడిపోవడం అన్నది క ఊడా ప్రజలు కోరుకున్న మార్పులో భాగమే. అంతే తప్ప కాంగ్రెస్ మీద ప్రేమతో కాదు. ఇకపోతే తమిళనాడు ఫలితం అనూహ్యం. ప్రముఖ సినీ నటుడు విజయ్ కొత్తగా పెట్టిన టివికె పార్టీకి వందకుపైన సీట్లొచ్చాయి. మరికొందరిని కలుపుకొని ఆయనే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. మరి ఇక్కడ బిజెపి ఓటు చోరీ చేయలేకనా అన్నది మమతా బెనర్జీ చెప్పాలి. రెండేళ్ల కింద జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డిఎంకె కూటమి క్లీన్ స్వీప్ చేసింది. అంతలోనే డిఎంకెపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడానికి రాజకీయ సమీకరణాలు, సామాజిక అంశాలు ప్రముఖంగా పని చేశాయని అర్థమవుతుంది. బిజెపి ఎంతగా పాకులాడినా తమిళనాట ప్రాంతీయ పార్టీలనే ప్రజలు ఆదరించారు. పశ్చిమబెంగాల్‌లో మమత పార్టీ టిఎంసి అవినీతిమయమైంది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో, శాంతి భద్రతలను పరిరక్షించడంలో ఘోరంగా విఫలమైంది. బంగ్లాదేశ్ నుంచి అక్రమ చొరబాటు అంశాన్ని రాజకీయంగా ఉపయోగపెట్టుకుంది. ఇవన్నీ మరచిన మమత తానేదో పునీతురాలినని చెప్పుకోవడం, సిఎంగా రాజీనామా చేయనని ప్రకటించుకోవడం అహంకారంతో కూడిన అవివేకానికి నిదర్శనం. అలా చేస్తే బర్తరఫ్ చేయడం తప్ప మరోమార్గం ఉండదు.

# రైతులు ధైర్యం కోల్పోవద్దు

- ఆత్మహత్యలకు అస్సలు పాల్పడవద్దు
- కాంగ్రెస్ పాలనలో వేయిమంది రైతులు మృతి
- వారందరికీ పదిలక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్



**వరంగల్, మే 6 :** రైతులు కాంగ్రెస్ నయవంచనకు బలికావద్దని.. గుండె ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకోవద్దని రైతు సోదరులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రైతులకు మళ్లీ మంచి రోజులు వస్తాయని తెలిపారు. రెండేళ్లలో రాబంధు రాజ్యం పోయి.. రైతుబంధు కేసీఆర్ రాజ్యం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రైతు సంగ్రామ సదస్సులో రైతుల పక్షాన నాలుగు తీర్మానాలు చేస్తున్నామని ప్రకటించారు. కాంగ్రెస్ రాబంధు పాలనలో వెయ్యి మందికిపైగా రైతులు చనిపోయారని.. రోడ్డున పడ్డ ఒక్కో రైతు కుటుంబానికి రూ.10లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. రైతు సంగ్రామ సదస్సులో చేసిన తీర్మానాలను కాంగ్రెస్ ప్రభుత్వానికి పంపిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వరంగల్ వచ్చి భద్రకాళి అమ్మవారి మీద ఒట్టుపెట్టి రుణమాఫీ చేస్తానని అన్నాడని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఏ ఊరికైనా వెళ్లి అడుగుదాం.. ఒక్క ఊరిలోనైనా రైతులందరికీ రుణమాఫీ జరిగిందంటే రాజీనామా చేస్తానని సవాలు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ చారానా.. టోపీ బారానా అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రుణమాఫీ పూర్తికాక రైతులు పురుగుల మందు తాగారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో అన్నీ దందాలు, కమీషన్లు, కొట్లాటలే అని విమర్శించారు. రేవంత్ రెడ్డి 69సార్లు ఢిల్లీకి వెళ్లాడని.. కానీ 69 పైసలు కూడా తేలేదని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యువల్ సీఎం అని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి వెళ్లి రేవంత్ రెడ్డి కప్పం కడుతున్నాడని తెలిపారు. రాష్ట్రంలో రాహుల్ బంధు నడుస్తుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, ప్రజల గురించి పట్టించుకునే వాళ్లే లేరని అన్నారు. రైతులకు ఇవ్వడానికి పైసలు లేవు.. కానీ రాహుల్ గాంధీకి మాత్రం మూటలు పంపిస్తున్నాడని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతులను నంబర్‌వన్ స్థానంలో నిలిపారని కేటీఆర్ గుర్తుచేశారు. ఆగమైన తెలంగాణను బాగుచేసింది బీఆర్ఎస్ అని తెలిపారు. రైతు ప్రగతికి కేసీఆర్ అద్భుతమైన పథకాలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. కేసీఆర్ కంటే రైతును బాగా చూసుకున్న నాయకుడు దేశంలోనే లేడని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో రైతు ప్రగతికి విప్లవం సృష్టించామని అన్నారు. పదేళ్లలో రైతులకు రూ.5లక్షల కోట్లు ఖర్చుపెట్టిన నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. కేసీఆర్ హయాంలో సాగు పెరిగి వరంగల్‌లో భూముల రేట్లు పెరిగాయని అన్నారు. కానీ కాంగ్రెస్ వచ్చాక భూముల ధరలు పడిపోయాయని అన్నారు. ధాన్యం కొనుగోలు కోసం వానల్లో, ఎండల్లో రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్సెట్టిపేట కొనుగోలు కేంద్రంలో గోడ కూలి నలుగురు రైతులు చనిపోయారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో మళ్లీ వెనుకటి రోజులు వస్తున్నాయని వాపోయారు.

# రైతుల కన్నీళ్లలో రేవంత్ కొట్టుకుపోవడం ఖాయం

### వరంగల్ రైతు సంగ్రామ సభలో సత్యవతి రాథోడ్

**వరంగల్, మే 6 :** కేసీఆర్ పాలన రైతాంగానికి స్వర్ణయుగమని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. రైతుబిడ్డగా వ్యవసాయాన్ని పండుగ చేసే విధంగా కేసీఆర్ పాలన కొనసాగిందని అన్నారు. రేవంత్ రెడ్డిది ప్రజాపాలన కాదు రాబందు పాలన అని విమర్శించారు. రైతు కన్నీళ్లలో రేవంత్ ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని స్పష్టం చేశారు. హనుమకొండలో బీఆర్ఎస్ చేపట్టిన రైతు సంగ్రామ సభలో సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతు బాగుండాలంటే మళ్లీ కేసీఆర్ పాలన రావాలని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయం ఆగమైందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. రెండున్నరేళ్లలో వెయ్యి మంది రైతులు చనిపోయారని తెలిపారు. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యలే అని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన గడ్డ వరంగల్ అని తెలిపారు. బీఆర్ఎస్ సభ పెడతామంటే కాంగ్రెస్ ప్రభుత్వం వణికిపోతుందని అన్నారు. కేసీఆర్ జగిత్యాలలో మీటింగ్ పెడితే అదే సమయానికి రేవంత్ రెడ్డి మీటింగ్ పెట్టారని తెలిపారు. కానీ రేవంత్ సభ అట్టర్ ఎ÷-లాప్ అయ్యిందని విమర్శించారు. ఒక్క ఎకరానికి రైతు భరోసా వేసి అలయ్ బలయ్ చేసుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులను పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శించారు. రైతులకు కేసీఆర్ రూ.72వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. వరంగల్ జిల్లాలో చివరి భూముల వరకు కేసీఆర్ నీళ్లిచ్చారని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాను కేసీఆర్ సస్యశ్యామలం చేశారని అన్నారు.



# మక్క కొనుగోళ్లు చేపట్టండి

### నిర్మల్ జాతీయ రహదారిపై రైతుల ఆందోళన

**నిర్మల్, మే 6 :** మొక్కజొన్న, జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రైతుల ఆందోళన చేపట్టారు. నిర్మల్ జిల్లా లోని దిలావర్‌పూర్ మండలం గుండంపెల్లి గ్రామ రైతులు నిర్మల్- బైంసా జాతీయ రహదారిపై బైఠాయించారు. ఆరుగాలం కష్టపడి పంట లు పండిస్తే కొనుగోలు కేంద్రాలు లేక పంటలు నష్టపోతున్నామని రై తులు ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర లేక, అప్పులు చేసి పం డిస్తే తీరా దాళారులకు అమ్మాల్సిన దుస్థితి నెలకొందన్నారు. జిల్లా కలె క్టర్ వచ్చి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసే వరకు ఆందోళన విరమిం చబోమని స్పష్టం చేశారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామ ని హెచ్చరిం చారు. రైతుల ఆందోళనతో భారీగా ట్రాఫిక్ జాంమ్ ఏర్పడింది.

# సిఎం పదవికి హిమంతబిశ్వ శర్మ రాజీనామా

### గవర్నర్‌ను కలిసి రాజీనామా సమర్పణ

**గౌహతి, మే 6 :** అస్సాం ముఖ్యమంత్రి పదవికి హిమంత బిశ్వ శర్మ రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యకు అందజేశారు. బుధవారం లోక్ భవన్‌కు వెళ్లిన హిమంత బిశ్వశర్మ.. తన కేబినెట్ సహచరులతో కలిసి రాజీనామా చేశారు. దీంతో బీజేపీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ సీఎం కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. రాజీనామాను ఆమోదించి, కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించే వరకూ శర్మను తాత్కాలిక ముఖ్యమంత్రిగా కొనసాగాలని గవర్నర్ కోరినట్లు వెల్లడించింది. రాజీనామా అనంతరం లోక్ భవన్ వెలుపల మీడియాతో హిమంత బిశ్వ శర్మ మాట్లాడారు. మే 11 తర్వాత ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రుల ప్రమాణ స్వీకారం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఇది చరిత్రాత్మక విజయం కావడంతో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించినట్లు ఆయన వెల్లడించారు.

# నెల్లూరులో మహానాడుకు భారీగా ఏర్పాట్లు


### మహానాధు సభాస్థలి వద్ద మంత్రుల భూమిపూజ

**నెల్లూరు, మే 6 :** ఈ నెల 27వ తేదీ నుంచి 29 వరకు తెలుగుదేశం మహానాడు నిర్వహణకు భారీగా ఏర్పాట్లు చేయనున్నారు.కోవూరు నియోజకవర్గం ఇఫ్కో కిసాన్ సెజ్‌లో మహానాడు ఏర్పాట్లకు వైభవంగా భూమి పూజ జరిగింది. ఏపీతో పాటు పలు రాష్ట్రాల నుంచి ప్రముఖులు, నేతలు, శ్రేణులు తరలి రానున్నారు. భూమి పూజలో ఎంపీ వేమిరెడ్డి, మంత్రులు ఆనం రామనారాయణ, నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు రాష్ట్ర నేతలందరూ జిల్లాలోనే ఉంటారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. భవిష్యత్తుతరాలకు ఉపయోగపడేలా తీర్మానాలు ఉంటాయన్నారు. మొదటి రెండు రోజులు 20 వేల మంది డెలిగేట్స్ వస్తారని.. మూడో రోజు బహిరంగ సభ ఉంటుందని వెల్లడించారు. బహిరంగసభకు 7 లక్షలకు పైగా కార్యకర్తలు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. నెల్లూరులో మొదటిసారి మహానాడు నిర్వహిస్తున్నామని మంత్రి నారాయణ అన్నారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో 2200 ఎకరాల స్థలం ఉందని.. పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు ఉండవని అన్నారు. పార్టీ క్యాడర్‌లో నూతనోత్సాహం కనిపిస్తోందన్నారు. మూడు రోజుల పాటు జరిగే మహానాడులో ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. అందర్నీ సమన్వయం చేస్తూ, సమష్టి కృషితో మహానాడును విజయవంతం చేస్తామని మంత్రి వెల్లడించారు.'మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి గత ఎన్నికల్లో అన్ని స్థానాల్లో తామే గెలుస్తామంటూ ప్రగల్భాలు పలికారు. ఒక్క స్థానంలోనూ వైసీపీని గెలిపించలేక పోయారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఈసారైనా కనీసం ఒక స్థానాన్ని గెలిపించే దమ్ము నీకుందా?.. దమ్ముంటే గెలిపించి చూపించు' అంటూ కాకాణికి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర సవాల్ విసిరారు.

# శ్రీసిటీలో క్యారియర్ ఏసీ పరిశ్రమ

### శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్

**తిరుపతి, మే 6 :** శ్రీసిటీలో క్యారియర్ ఏసీ పరిశ్రమకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ.. క్యారియర్ ఏసీ తయారీ కేంద్రం భారతదేశంలోని తమ ఉత్పత్తుల్లో 80 శాతం శ్రీసిటీలో నుంచి సరఫరా చేయబోతోందని తెలిపారు. కుటుంబంలో తల్లి ప్రేమ ముందు.. ఓ తండ్రి చేసే త్యాగాలు పిల్లల కంటికి తెలియదన్నారు. అలాగే ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి చేసిన కృషిని కొందరు సరిగ్గా అర్థం చేసుకోరని.. అయినా కూడా ఆయన అనుకున్నది సాధిస్తారని చెప్పుకొచ్చారు. పారిశ్రామికవేత్తలకు ఏ రకమైన సేవలైనా ఒక్క వాట్సాప్ మేసేజ్‌తో చేయటానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. శ్రీసిటీలో 70 వేల మంది ఉద్యోగుల్లో 35 వేల మంది మహిళలు ఉన్నారని.. శ్రీశక్తికి ఇది నిదర్శనమన్నారు. శ్రీసిటీలోని పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఈ నెలాఖరులోపు ఏఐ ద్వారా నైపుణ్యం ఉన్న వారికి ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుట్టబోతున్నామని లోకేశ్ వెల్లడించారు. శ్రీసిటీలో క్యారియర్ గ్లోబల్ సంస్థ వెయ్యి కోట్లు పెట్టుబడి పెట్టనుంది. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 3 వేల మందికి ఉపాధి లభించనుంది. శ్రీసిటీ పరిధిలోని ఆరూరు వద్ద ఈ పరిశ్రమకు 40 ఎకరాల స్థలం కేటాయించారు. ఒకటి, రెండు టన్నుల సామర్థ్యం కలిగిన ఏసీలే కాకుండా భారీ పారిశ్రామిక సముదాయాలకు వినియోగించే 1000 టన్నుల నుంచి 5000 టన్నుల సామర్థ్యం కలిగిన కూలింగ్ సిస్టమ్స్‌ను క్యారియర్ సంస్థ తయారుచేయనుంది. ఉదయం సత్యవేడు నియోజకవర్గం శ్రీసిటీ పారిశ్రామికవాడకు చేరుకున్న మంత్రి లోకేశ్‌కు టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ప్రతిఒక్కరినీ మంత్రి ఆత్మీయంగా పలకరించి ఫొటోలు దిగారు. శ్రీసిటీలో శంకుస్థాపన అనంతరం మంత్రి లోకేశ్ తిరిగి ఉండవల్లికి వెళ్లనున్నారు.



# సినిమా పేరుతో 25 లక్షల మోసం

### సంగీత దర్శకుడు పలాశ్ మచ్చల్‌పై కేసు

**ముంబయి, మే 6 :** ప్రేమపేరుతో టీమిండియా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన ను మోసం చేసిన ప్రముఖ సంగీత దర్శకుడు పలాశ్ ముచ్చల్ పై మహారాష్ట్రలోని సాంగ్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. స్మృతి మంధాన స్నేహితుడు విజ్ఞాన్ ప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ పరిణామం చోటుచేసుకుంది. విజ్ఞాన్ ప్రకాశ్ తన ఫిర్యాదులో పలాశ్ ముచ్చల్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఒక సినిమా ప్రాజెక్టు కోసం పలాశ్ తన వద్ద నుంచి రూ. 25 లక్షలు తీసుకున్నారని, అయితే ఆ తర్వాత తనను మోసం చేశారని విజ్ఞాన్ పేర్కొన్నారు. గత ఏడాది నవంబరు 22న ఈ విషయంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగిందని, ఆ సమయంలో పలాశ్ తన కులాన్ని ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించారని ఫిర్యాదులో వివరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సాంగ్లీ పోలీసులు పలాశ్ ముచ్చల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం పోలీసులు ఈ కేసును విచారిస్తున్నారు. దీనిపై పలాశ్ ముచ్చల్ ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది. పలాశ్ ముచ్చల్ వ్యక్తిగత జీవితం కూడా గత కొంతకాలంగా వార్తల్లో నిలుస్తోంది. ఆయన, క్రికెటర్ స్మృతి మంధాన మధ్య నిశ్చితార్థం జరిగి, పెళ్లి కూడా ఎలాన్ అయినప్పటికీ అనూహ్యంగా అది రద్దయినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై అప్పట్లో సోషల్ మీడియాలో అనేక ఊహాగానాలు వెలువడ్డాయి. వాటిపై స్పందించిన పలాశ్, ఆధారాలు లేని వార్తలను నమ్మవద్దని, తన వ్యక్తిగత జీవితంపై అనవసర వ్యాఖ్యలు చేయొద్దని పేర్కొన్నారు. అయితే తాజాగా నమోదైన అట్రాసిటీ కేసుతో పలాశ్ ముచ్చల్ చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కేసు విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని పోలీసులు చెబుతున్నారు.

# యూపిలో దారుణ ఘటన

- బాలుడిపై అత్యాచారం హత్య
- దుండగుడిని కాల్చి చంపిన పోలీసులు

**లక్నో, మే 6 :** ఓ కామాంధుడిని ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు కాల్చి చంపేశారు. ఏడేళ్ల బాలుడిపై హత్యాచారం కేసులో ఎన్‌కౌంటర్ చేశారు. పక్కా సమాచారంతో నిందితుడిని పట్టుకునేందుకు వెళ్లగా పోలీసులపై దుండగుడు కాల్పులకు తెగపడ్డాడు. ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరపగా కామాంధుడు హతమయ్యాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది. మంగళవారం నాడు హర్దోయ్ జిల్లా మతియమౌలోని మొక్కజొన్న పొలంలో ఏడేళ్ల బాలుడి మృతదేహం లభ్యమైంది. చిన్నారిని అపహరించిన మెహనూర్ (32) అత్యాచారం చేశాడు. అనంతరం హత్య చేసి మృతదేహాన్ని అక్కడే పడేశాడు. ఈ నేరాన్ని లైంగిక దాడిగా కాకుండా డబ్బుల కోసం చేసిన కిడ్నాప్‌గా చిత్రీకరించేందుకు నిందితుడు ప్రయత్నించాడు. ఈ మేరకు దొంగిలించిన సిమ్ కార్డు సహాయంతో బాధిత కుటుంబానికి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడు. అయితే, వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మేరకు మెహనూర్‌పై రూ.50 వేల రివార్డును పోలీసులు ప్రకటించారు. అయితే, హర్దోయ్ జిల్లా మల్లావన్ ప్రాంతంలో నిందితుడు మెహనూర్ ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. అతన్ని పట్టుకునేందుకు స్థానిక పోలీసులు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ సంయుక్త బృందాలు రంగంలోకి దిగాయి. నిందితుడు ఉన్న ప్రాంతానికి చేరుకుని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశాయి. ఈ సందర్భంగా మెహనూర్ ఏకంగా పోలీసులపైకే కాల్పులకు తెగపడ్డాడు. కామాంధుడి దాడిలో సీనియర్ ఎస్‌ఓజీ అధికారి రాజేశ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు కూడా ఎదురుకాల్పులు జరపగా.. మెహనూర్ ప్రాణాలు కోల్పోయినట్లు పోలీస్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్ తెలిపారు. అతని మృతదేహం వద్ద రెండు తుపాకులు దొరికినట్లు వెల్లడించారు. నిందితుడిని కన్నౌజ్ జిల్లావాసిగా గుర్తించినట్లు చెప్పారు. అతనికి నేర చరిత్ర ఉందని.. పలు జిల్లాల్లో దాదాపు పన్నెండు కేసులు మెహనూర్‌పై నమోదైనట్లు ఎస్పీ అశోక్ కుమార్ వెల్లడించారు.

# ఎల్‌పీజీ ఉత్పత్తి పెంచుతున్న రిలయన్స్




పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో, ఏర్పడిన సరఫరా అంతరాయాల వల్ల మనదేశంలో వంట గ్యాస్ (ఎల్‌పీజీ)కు కొరత ఏర్పడుతోంది. అందుకే ఎల్‌పీజీ ఉత్పత్తి పెంచడంపై దృష్టి సారించిన రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇందుకోసం ఆల్కలైట్స్ ఉత్పత్తిని తగ్గించుకుంటోంది. గ్యాసోలైన్‌లో మిశ్రమంగా ఆల్కలైట్స్‌ను వాడతారు. రిలయన్స్ తన రిఫైనింగ్ కాంప్లెక్స్‌లో ఆల్కైలేషన్ యూనిట్‌ను నిర్వహిస్తోంది. ఇందులో ఉత్పత్తి చేసిన ఆల్కలైట్స్‌ను అమెరికాకు ఎగుమతి చేస్తోంది. ఎల్‌పీజీ ఉత్పత్తి పెంచేందుకు ఆల్కలైట్స్ ఎగుమతులను రిలయన్స్ ఇండస్ట్రీస్ తగ్గించుకుంటోంది. పశ్చిమాసియా యుద్ధానికి ముందున్న పరిస్థితులతో పోలిస్తే, ఎల్‌పీజీ ఉత్పత్తి మూడింతలకు పైగా పెరిగినట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ చెబుతోంది. దీంతో పశ్చిమాసియా దేశాల నుంచి తగ్గిన ఎల్‌పీజీ దిగుమతుల్లో కొంత మేర భర్తీ చేయగలిగామని కంపెనీ పేర్కొన్నట్లు ఓ ఆంగ్ల వెబ్‌సైట్ తెలిపింది.








# పంజాబ్ కింగ్స్‌పై సన్‌రైజర్స్ పంజా

## ఏడో విజయంతో అగ్రస్థానానికి సన్‌రైజర్స్ హైదరాబాద్

## పంజాబ్‌కు వరుసగా మూడో ఓటమి






**హైదరాబాద్ :** సొంతగడ్డపై సన్‌రైజర్స్ అదరగొట్టింది. గత మ్యాచ్ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకున్న కమిన్స్ సేన ఆల్‌రౌండ్ ఆటతో సత్తాచాటింది. బుధవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 33 పరుగుల తేడాతో పంజాబ్‌ను ఓడించింది. ఇషాన్ కిషన్ (55; 32 బంతుల్లో 2x4, 4x6), హెన్రిచ్ క్లాసెన్ (69; 43 బంతుల్లో 3x4, 4x6) అర్ధసెంచరీలకు.. అభిషేక్ శర్మ (35; 13 బంతుల్లో 2x4, 4x6), ట్రావిస్ హెడ్ (38; 19 బంతుల్లో 3x4, 3x6), నితీశ్‌కుమార్‌రెడ్డి (29 నాటౌట్; 13 బంతుల్లో 2x4, 2x6) మెరుపులు తోడవడంతో మొదట సన్‌రైజర్స్ 4 వికెట్లకు 235 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం ఆతిథ్య జట్టు బౌలింగ్, ఫీల్డింగ్ ముందు పంజాబ్ తేలిపోయింది. 7 వికెట్లకు 202 పరుగులు చేయగలిగింది. ఒంటరి పోరాటం చేసిన కూపర్ కనోలీ (107 నాటౌట్; 59 బంతుల్లో 7x4, 8x6) శతకంతో అజేయంగా నిలిచాడు.

### ఆరంభంలోనే తేలిపోయింది:

దిల్లీ క్యాపిటల్స్‌పై 265 పరుగుల లక్ష్యాన్ని 18.5 ఓవర్లలోనే ఛేదించి ఐపీఎల్‌లో చరిత్ర సృష్టించిన పంజాబ్.. స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తే 236 పరుగుల భారీ లక్ష్యం కష్టమేమీ కాదు. అయితే గత రెండు మ్యాచ్‌ల్లో ఓటమితో ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన పంజాబ్.. స్థాయికి తగ్గట్లు ఆడలేకపోయింది. పదునైన బౌలింగ్.. మెరుగైన ఫీల్డింగ్‌తో సన్‌రైజర్స్ తమ ప్రణాళికల్ని పక్కాగా అమలు చేసింది. పంజాబ్ ఫీల్డర్ల మాదిరిగా సన్‌రైజర్స్ మైదానంలో తప్పులు చేయకపోవడంతో ఆ జట్టుకు మొదటి ఓవర్లోనే కష్టాలు మొదలయ్యాయి. తొలి ఓవర్ చివరి బంతికి ప్రియాంశ్ ఆర్య (1)..



రెండో ఓవర్ మొదటి డెలివరీకి ప్రభ్‌సిమ్రన్‌సింగ్ (3) పెవిలియన్ బాటపట్టడంతో పంజాబ్ కోలుకోలేకపోయింది. భారీ లక్ష్య ఛేదనలో ఓపెనర్లిద్దరూ మొదటి ఏడు బంతుల్లోనే ఔటవడం పంజాబ్‌ను ఆత్మరక్షణలోకి నెట్టేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (5) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవకపోవడంతో పంజాబ్స్ ఓటమి ఖాయమైపోయింది. కమిన్స్ (2/34), నితీశ్ (1/11), ఇషాన్ మలింగ (1/36) మొదటి నాలుగు ఓవర్లలో 3 వికెట్లు పడగొట్టడంతో మ్యాచ్ సన్‌రైజర్స్ వైపు మొగ్గింది. మార్కస్ స్టాయినిస్ (28; 14 బంతుల్లో 3ఐ4, 2ఐ6) బ్యాట్ ఝుళిపించినా.. అదీ కొద్దిసేపే. అతడిని స్పిన్నర్ శివాంగ్‌కుమార్ (2/45) బోల్తా కొట్టించాడు. అయితే ఓవైపు వికెట్లు పడుతున్నా.. మరో ఎండ్‌లో కనోలీ చెలరేగాడు. సూర్యాంశ్ షెడ్జే (25; 17 బంతుల్లో 1x4, 2x6) అతడికి కాసేపు సహకరించాడు. కానీ షెడ్జే ఔటయ్యాక పంజాబ్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. కానీ కనోలీ చివరి వరకు ధాటిని కొనసాగించి సెంచరీ పూర్తి చేశాడు. ఓటమి అంతరాన్నీ తగ్గించాడు.



## భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకు తెరించేలా అమెరికా, ఇరాన్ దేశాలు ఒక ఒప్పందానికి చేరువయ్యాయన్న వార్తలు మార్కెట్‌లో ఉత్సాహానికి కారణమయ్యాయి. ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న అంచనాలతో బ్రెంట్ క్రూడ్ కూడా దాదాపు 9 శాతం క్షీణించి 100 డాలర్లకు చేరువ అవ్వడం మరింత కలిసొచ్చింది. దీంతో ఉదయం లాభనష్టాల మధ్య కదలాడిన సూచీలు.. చివరి గంటలో దూసుకెళ్లాయి. మదుపర్ల సంపద సుమారు రూ.6 లక్షల కోట్లు పెరిగి రూ.473 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,424.36 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,017.79) లాభాల్లో ప్రారంభమైంది. మధ్యాహ్నం వరకు లాభాల్లో కొనసాగిన సూచీ.. ఇంట్రాడే గరిష్ఠాల నుంచి దాదాపు 800 పాయింట్లు క్షీణించింది. అమెరికా- ఇరాన్ ఒప్పందానికి సంబంధించిన వార్తలు రావడంతో సూచీ పుంజుకొంది. చివరికి 940.73 పాయింట్ల లాభంతో 77,958.52 వద్ద ముగిసింది. నిఫ్టీ 298.15 పాయింట్ల లాభంతో 24,330.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 56 పైసలు బలపడి 94.62గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో ఏకంగా 6 శాతం మేర దూసుకెళ్లింది. ట్రెంట్, ఏషియన్ పెయింట్స్, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్ ప్రధానంగా లాభపడ్డాయి. రిలయన్స్, ఎల్అండ్‌టీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్ల వద్ద ట్రేడవుతండగా.. బంగారం ఔన్సు 4700 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



## ప్రీమియం ప్లాన్‌ల కోసం జియో, ఎయిర్‌టెల్ 'స్లైసింగ్' వ్యూహం

న్యూఢిల్లీ : ప్రస్తుతం టెలికాం కంపెనీలు 4జీ ధరలకే 5జీ సేవలను అందిస్తున్నాయి. దీంతో ఆశించిన ఆదాయం రావడం లేదనేది కంపెనీల వాదన. 5జీ స్పెక్ట్రమ్ కొనుగోలు, ఆ మౌలిక సదుపాయాల కల్పన కోసం చేసిన ఖర్చును తిరిగి రాబట్టాలంటే.. ప్రీమియం సర్వీసులు అందించడం ఒక్కటే మార్గమని టెల్కోలు భావిస్తున్నాయి. ఇందులోభాగంగా ఎయిర్‌టెల్ తన ఆదాయాన్ని పెంచుకునేందుకు 'నెట్‌వర్క్ స్లైసింగ్' సాంకేతికతను ఉపయోగించి ప్రీమియం ప్లాన్‌లను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఒకే ఫిజికల్ నెట్‌వర్క్ మౌలిక సదుపాయాలపై బహుళ వర్చువల్ నెట్‌వర్క్‌లను సృష్టించడం ఈ సాంకేతికత ఉద్దేశం. ఒక్కో 'స్లైస్' ఒక్కో నిర్దిష్ట అవసరానికి తగ్గట్టుగా పనిచేస్తుంది. ఉదాహరణకు హై-స్పీడ్ గేమింగ్ కావాలనుకునే వారికి ఒక స్లైస్, వీడియో స్ట్రీమింగ్ కోసం ఒకటి.. ఎంటర్‌ప్రైజ్ అవసరాల కోసం మరొకటి అన్నమాట. అంటే మీరు హైస్పీడ్ డేటా వేగంతో గేమింగ్ ఆడాలనుకుంటే ఎక్కువ డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నమాట. ఇలా 5జీ నెట్‌వర్క్‌ను నిర్దిష్ట కస్టమర్ల అవసరాలను తీర్చడానికి వినియోగించొచ్చు. ఇప్పటికే రిలయన్స్ జియో 5జీ నెట్‌వర్క్ ఆధారిత ప్రీమియం సర్వీసులను తీసుకొచ్చేందుకు ట్రయల్స్ మొదలుపెట్టింది. క్లౌడ్ గేమింగ్ కోసం ప్రత్యేక ప్లాన్ తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇదే మాదిరిగా ఎయిర్‌టెల్ కూడా ఇందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలిస్తోంది. మెరుగైన వేగం, తక్కువ లేటెన్సీ కోరుకునే వారి కోసం ప్రీమియం ధరలతో ప్రత్యేక ప్లాన్‌లు అందించాలని చూస్తోంది. దీనివల్ల టెల్కోల ఆదాయం 20-30 శాతం పెరగనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం చైనా, ఫిన్లాండ్ వంటి దేశాల్లో ఇలాంటి స్పీడ్ ఆధారిత ప్లాన్‌లు అందుబాటులో ఉన్నాయి. అయితే, భారత్ విషయానికొచ్చేసరికి నెట్ న్యూట్రాలిటీ నిబంధనలు ప్రతిబంధకంగా మారనున్నాయి. ఇలా వేర్వేరు వేగాలతో ప్లాన్‌లు ఇవ్వడం నెట్ సమానత్వ నియమాలకు విరుద్ధమా? కాదా?అనే అంశంపై టెలికాం నియంత్రణ సంస్థ నుంచి స్పష్టత రావాల్సిఉంది. ఇది కేవలం నెట్‌వర్క్ పనితీరుకు సంబంధించింది కాబట్టి నిబంధనల ఉల్లంఘన కాకపోవచ్చని నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు 5జీ కింద లభించే 400-500 ఎంబీపీఎస్ వేగం సాధారణ యాప్‌లకు అవసరం లేదనేది ఎయిర్‌టెల్ అభిప్రాయం. కాబట్టి సామాన్యులకు ఒక ధర, అత్యధిక వేగం కావాలనుకునే వారికి ప్రీమియం ధర వసూలుచేయడం ద్వారా తన 5జీ మౌలిక సదుపాయాలపై పెట్టిన పెట్టుబడులను తిరిగి రాబట్టుకోవాలని కంపెనీ భావిస్తోంది.




## శాంసంగ్ ఏ 1 ట్రిలియన్ డాలర్లు

ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ శాంసంగ్ షేర్లు భారీగా పెరిగాయి. బుధవారం ఈ కంపెనీ షేర్లు ఏకంగా 15శాతం పెరగడంతో.. మార్కెట్ విలువ 1 ట్రిలియన్ డాలర్ల (రూ.95 లక్షల కోట్లకు పైగా) మార్క్‌ను దాటి పరుగులు పెడుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టెక్నాలజీ అంతకంతకూ విస్తరిస్తున్న నేపథ్యంలో మెమొరీ చిప్‌లకు భారీగా డిమాండ్ పెరుగుతుండడంతో శాంసంగ్ భారీగా లాభాలను దక్కించుకుంటోంది. తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ తర్వాత ఈ మార్కును చేరిన రెండో ఆసియా కంపెనీగా ఇది నిలిచింది. రాబోయే 12 నెలల్లో ఈ స్టాక్ సుమారు 30 శాతం పెరుగుతుందని బ్లూమ్‌బర్గ్ నివేదికలు పేర్కొంటున్నాయి. శాంసంగ్ సెమీకండక్టర్ విభాగం మార్చి త్రైమాసికంలో అంచనాలను మించి 48 రెట్ల చారిత్రక లాభాన్ని ఆర్జించింది. ఏఐ డేటా సెంటర్ ఆర్డర్లు భారీ మార్జిన్లను అందించడమే దీనికి కారణం. పరిమిత సరఫరా మధ్య కాంట్రాక్ట్ ధరలు మరింత వేగంగా పెరుగుతుండడంతో రాబోయే పలు త్రైమాసికాలలో ఈ విభాగం తన రికార్డు స్థాయి లాభాన్ని మరింత పెంచుకుంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రపంచ మార్కెట్‌లో అధునాతన చిప్‌లు, కంప్యూటింగ్ సామర్థ్యానికి నిరంతరం డిమాండ్ పెరుగుతుండడంతో ఎస్కే హైనిక్స్, టీఎస్ఎంసీ వంటి ఇతర మెమొరీ సంస్థల షేర్లు కూడా ఈ నెలలో రికార్డు స్థాయి గరిష్టాలకు చేరుకున్నాయి. అమెరికాలో తన డివైజ్‌ల కోసం ప్రధాన ప్రాసెసర్‌లను ఉత్పత్తి చేయడానికి శాంసంగ్‌ను ఉపయోగించుకోవడంపై యాపిల్, ఆ సంస్థతో ప్రాథమిక చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. కాగా ప్రస్తుతం మెమొరీ మార్కెట్‌లో సరఫరా కొరత ఉందని జూపిటర్ అసెట్ మేనేజ్‌మెంట్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్ సామ్ కొన్రాడ్ పేర్కొన్నారు. ఈ ఏడాదితో పోల్చితే 2027లో దీని డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

## డీజే టిల్లు స్క్వేర్ క్రేజీ పోస్టర్..



డీజే టిల్లు స్క్వేర్ సినిమా గత కొన్ని రోజులుగా చడీచప్పుడు లేకుండా ఉండిపోయింది. 2023 ఆగస్టులోనే విడుదల కావాల్సిన ఈ మూవీ అంతకంతకూ వాయిదా పడుతూనే వచ్చింది. కంటెంట్‌ను ఇంకా సరిచేసుకుంటూ వస్తున్నారు. ఇక ఈ చిత్రం అయితే ఈ ఏడాది ఫిబ్రవరిలోనే సందడి చేయబోతోంది. అనుపమ పరమేశ్వరన్ స్క్రీన్ మీద ఎక్కువగా రొమాంటిక్ సీన్లు, బోల్డ్ సన్నివేశాలు, లిప్ లాక్‌లకు అంత సామాన్యంగా ఒప్పుకోదు. మొదటి సారిగా ఆశిష్ రౌడీ బాయ్స్ సినిమాలోనే లిప్ లాక్‌కు అంగీకరించింది. ఆ టైంలో అనుపమ లిప్ లాక్‌లు, ఆశిష్ మీద ట్రోల్స్ ఎంతగా వచ్చాయో అందరికీ తెలిసిందే. ఆ లిప్ లాక్ సీన్లు చూసి అనుపమ అభిమానుల గుండెలు బద్దలయ్యాయి. ఇక అలాంటి అనుపమ సిద్దు జొన్నలగడ్డతో నటిస్తుందనడంతోనే అభిమానులు మరింతగా హర్ట్ అయ్యారు. డీజే టిల్లులో రాధిక అంటూ నేహా శెట్టితో సిద్దు చేసిన రొమాన్స్ అందరికీ తెలిసిందే. ఇక ఇది టిల్లు స్క్వేర్ అంటే.. రొమాన్స్ ఇంకే రేంజ్‌లో ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇప్పటికే వదిలిన ప్రచార కార్యక్రమాలు అయితే అనుపమ, సిద్దుల మధ్య మంచి రొమాంటిక్ కెమిస్ట్రీ కుదిరినట్టుగానే కనిపిస్తోంది. ఇక తాజాగా వదిలిన న్యూ ఇయర్ పోస్టర్ అయితే అనుపమ అభిమానుల గుండెల్ని బద్దలు కొట్టేస్తున్నాయ.ట

సిద్దు జొన్నలగడ్డ మీద అనుపమ కూర్చున్న ఈ స్టిల్ చూసి అభిమానులు హార్ట్ బ్రోకెన్ ఎమోజీలు షేర్ చేస్తున్నారు. అనుపమ తన ఇన్ స్టాలో పెట్టిన ఈ పోస్ట్ కింద కామెంట్లు చూస్తే అంతా నవ్వుకోవాల్సిందే. బ్రేకప్ కంటే ఇదే బాధగా ఉందని ఒకరు.. ఇప్పుడు నువ్వు మా గుండెల్ని బ్రేక్ చేశావ్.. ఇది నీకు న్యాయమా? అన్నట్టుగా అనుపమ అభిమానులు గగ్గోలు పెడుతున్నారు. ఇకపై నువ్వు నా క్రష్ కాదు.. నేను సాయి పల్లవికి షిఫ్ట్ అవుతున్నాను.. అని మరో అభిమాని కామెంట్ పెట్టాడు. చీరలో నీ అందానికి ఫిదా అయ్యా కానీ.. ఇప్పుడు నువ్వు నా హృదయాన్ని బద్దలు కొట్టావ్.. అని ఇంకో నెటిజన్ అన్నాడు. మనసులే కరగని లోకమే లోకమా అంటూ బోరున ఏడుస్తున్న ఎమోజీలను పెడుతూ తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. సలార్‌లో ప్రభాస్ చెప్పినట్టుగా.. నో వన్ షుడ్ టచ్ యూ అని వార్నింగ్ ఇస్తున్నారు అనుపమ అభిమానులు. ఈ ఇయర్ ఎండ్‌కు ఇలా హార్ట్‌ను బ్రేక్ చేస్తావా? అని ఇలా అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. అనుపమ దెబ్బకు అభిమానులు మాత్రం ఇలా ఉడికి చచ్చిపోతోన్నారు.

## న్యూ ఇయర్‌లో హీటెక్కించే లుక్



కొన్నేళ్లుగా ఇండస్ట్రీలో యాక్టివ్ గా ఉంటూ తనదైన ముద్ర వేసుకుంది. ఈ స్టార్ హీరోయిన్ తన నటనతో లక్షలాది అభిమానులను సొంతం చేసుకుంది. వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ సినీ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. కొన్నేళ్లుగా ఇండస్ట్రీలో యాక్టివ్ గా ఉంటూ తనదైన ముద్ర వేసుకుంది. ప్రస్తుతం ఇండియాలోనే టాప్ హీరోయిన్ గా అలరిస్తోంది. సినీ రంగంలోకి ప్రవేశించి చాలా కాలమైనా అగ్రకథానాయికగా కొనసాగుతుందంటే అందుకు కారణం నటన పట్ల అంకితభావంతో పాటు ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వడమే. అయితే కఠినమైన వర్కౌట్స్ చేస్తూ ఫిట్‌నెస్‌ను నిరంతరం కాపాడుకోవాలి. ఈ విషయంలో సమంత ముందుచూపుతో వ్యవహరిస్తోంది. వివిధ రకాల ఫిట్‌నెస్ యాక్టివిటీస్ చేస్తూనే హెల్త్ డ్రింక్స్‌కు ప్రాధాన్యం ఇస్తోంది. అయితే సమంత తన హెల్త్ పై ఫోకస్ పెట్టడంతో ఏడాదిగా సినిమాలకు బ్రేక్ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం చాలా యాక్టివ్ గా కనిపిస్తోంది. సోషల్ మీడియాలో డైలీ సందడి చేస్తోంది. తన పోస్టులతో ఫ్యాన్స్ ను ఆకట్టుకుంటోంది. తాజాగా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కు సంబంధించిన ఫొటోను అభిమానులతో పంచుకుంది. సముద్రపు ఒడ్డున సామ్ కొత్త సంవత్సర వేడుకలను జరుపుకుంది. ఈ సందర్భంగా న్యూ ఇయర్ కు స్వాగతం పలుకుతూ సూపర్ స్టిల్ ఇచ్చింది. ఆ ఫొటోను నెట్టింట షేర్ చేస్తూ ఫ్యాన్స్ కు కూడా న్యూ ఇయర్ విషెస్ తెలిపింది. 'చాలా మంది దేవదూతలు మన చుట్టూ ఉండవచ్చు.. నూతన సంవత్సర శుభాకంక్షలు' అంటూ క్యాప్షన్ ఇచ్చింది. దీంతో ఆమె అభిమానులు కూడా సమంతకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ ఇయర్ లో సామ్ కు మంచి రోజులు రావాలని ఆకాంక్షిస్తున్నారు. కెరీర్ లో కూడా ఆమె మరింత ఎత్తుకు ఎదగాలని కోరుకుంటున్నారు. సమంత ఇచ్చిన స్టిల్ మైండ్ బ్లోయింగ్ గా ఉందంటూ కామెంట్లు పెడుతున్నారు. సెలబ్రేషన్స్ లో భాగంగా సామ్ నైట్ వేర్ లో దర్శనమిచ్చింది. డీప్ బ్యాక్ లో అందాలను ప్రదర్శిస్తూ పోజులిచ్చింది. ప్రస్తుతం ఆ పిక్ నెట్టింట వైరల్ గా మారింది. సిటాడెల్ తో త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సిరీస్ సిటాడెల్ కు ప్రీక్వెల్‌గా రానుందని సమాచారం. సిటాడెల్ సిరీస్‌లో సమంతతోపాటు బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. స్టార్ డైరెక్టర్స్ రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహిస్తున్నారు.

## భీమా న్యూ ఇయర్ సర్‌ప్రైజ్ అదిరింది




అయితే ఈ మధ్య కాలంలో ఎలాంటి హడావుడి లేకపోవడంతో అసలు సినిమా ఏమైంది అనే చర్చ మొదలైంది. యాక్షన్ హీరో గోపీచంద్ ప్రస్తుతం కన్నడ దర్శకుడు హర్ష దర్శకత్వంలో ఒక సినిమా ను చేస్తున్న విషయం తెల్సిందే. చాలా రోజుల క్రితం ఈ సినిమాను ప్రకటించారు. సినిమా ప్రకటించిన సమయంలో అందరి దృష్టిని ఆకర్షించారు. అయితే ఈ మధ్య కాలంలో ఎలాంటి హడావుడి లేకపోవడంతో అసలు సినిమా ఏమైంది అనే చర్చ మొదలైంది. కొత్త సంవత్సరం కానుకగా గోపీచంద్, హర్ష సినిమా ఫస్ట్ లుక్ ను విడుదల చేయడం జరిగింది. భీమా అనే టైటిల్ తో ఈ సినిమాను గోపీచంద్ ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నాడు. ఈ సినిమాలో పోలీస్ ఆఫీసర్ గా గోపీచంద్ కనిపించబోతున్నాడని గతంలోనే ప్రకటన వచ్చిన విషయం తెల్సిందే. తాజాగా పోలీస్ ఆఫీసర్ గెటప్ లో గోపీచంద్ ను చూపిస్తూ భీమా టైటిల్ తో పోస్టర్ ను విడుదల చేసి ప్రేక్షకులకు కొత్త సంవత్సరం శుభాకాంక్షలను యూనిట్ సభ్యులు తెలియజేశారు. ప్రస్తుతం ఈ సినిమా యొక్క షూటింగ్ మంగళూరులో జరుగుతున్నట్లుగా యూనిట్ సభ్యులు తెలియజేశారు. దట్టమైన అటవీ ప్రాంతంలో గోపీచంద్ మరియు కొందరి పై యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరణ జరుపుతున్నారు. కేజీఎఫ్ మరియు సలార్ సినిమాలకు సంగీత దర్శకుడిగా చేసిన రవి బస్రూర్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తుండటం విశేషం. మాళవిక శర్మ, ప్రియా భవానీ శంకర్ లు హీరోయిన్స్ గా నటిస్తున్నారు. సక్సెస్ కోసం వెయిట్ చేస్తున్న గోపీచంద్ కు భీమా సినిమా 2024 లో ఆ సక్సెస్ ను ఇచ్చేనా చూడాలి.

## సెలబ్రేషన్స్‌లో మహేష్-గౌతమ్ సంథింగ్ స్పెషల్!



దీనిలో భాగంగా న్యూ ఇయర్ వేడుకలు 31 రాత్రి భారీ ఎత్తున సెలబ్రేట్ చేసుకు న్నట్లు తెలుస్తోంది. సూపర్ స్టార్ మహేష్ ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా! వెకేషన్ తో పాటు ఓ యాడ్ షూడ్ కూడా ప్లాన్ చేసుకుని దుబాయ్ వెళ్లిన సంగతి తెలిసిందే. పనిలో పనిగా న్యూ ఇయర్ వేడుకలు అక్కడే గ్రాండ్ గా ప్లాన్ చేసుకన్నారు. దీనిలో భాగంగా న్యూ ఇయర్ వేడుకలు 31 రాత్రి భారీ ఎత్తున సెలబ్రేట్ చేసుకు న్నట్లు తెలుస్తోంది. తాజాగా ఆ సెలబ్రేషన్ కి సంబంధించిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అందులో మహేష్..నమ్రత..సితార..గౌతమ్ తో పాటు మహేష్ కి అత్యంత సన్నిహితులు..స్నేహితులు కూడా సెలబ్రేషన్స్ లో భాగమైనట్లు తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలలో ఒకరైన నవీన్ ఏర్నేని కూడా భాగమైనట్లు కనిపిస్తుంది. మహేష్ తో సంస్థ కి ప్రత్యేక అనుబంధం ఉంది. ఈ నేపథ్యంలో ఈసారి వేడుకల్లో ఆయన పాల్గొని సర్ ప్రైజ్ చేసారు. ఓ పెద్ద స్టార్ హోటల్ వేదక ఎంతో గ్రాండ్ గా జరిగినట్లు తెలుస్తోంది. స్నేహితులందరికీతో మహేష్ ఫ్యామిలీ కెమెరాకి ఫోజులిచ్చింది. మిడ్ నైట్ ఫోటోలు ఎంతో కలర్ ఫుల్ గా ఉన్నాయి. ఇక అన్నింటికంటే? ఒక పిక్ సంథింగ్ స్పెషల్ గా ఆకట్టుకుంటుందని చెప్పొచ్చు. మహేష్ తనయుడు గౌతమ్ ఇద్దరు అలా వాక్ చేసుకుం టూ వెళ్తున్నారు. ఆ సమయంలో మహేష్ ..గౌతమ్ భుజాలపై చేతులు వేసి జీవిత పాఠాలు బోధిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇద్దరు జీన్స్ అండ్ టీషర్ట్ ధరించారు. గౌతమ్ కొంత కాలంగా విదేశాల్లో ఉండటం....మహేష్ ఇండియాలో సినిమా పనుల్లో బిజీగా ఉండటంతో తనయుడ్ని మిస్ అయ్యారు. దీంతో తనయుడిపై ప్రేమానురా గాలు పంచుతున్నట్లు కనిపిస్తుంది. ఇక అందమైన హోటల్ చుట్టూ కలర్ ఫుల్ లైట్లు ఎంతో మనోహరంగా లొకేషన్ కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నా యి. మహేష్ ఫ్యామిలీని అలా చూసి అభిమానులు మురిసి పోతున్నారు. గత ఏడాది కూడా మహేష్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ ఇలాగే దుబాయ్ హోటల్ లోనే సెలబ్రేట్ చేసుకున్న సంగతి తెలిసిందే.

## అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చిన టీమ్



ఎన్టీఆర్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అప్‌డేట్ వచ్చేసింది. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఒక పోస్టర్ వదిలారు. ఈ పోస్టర్‌లో ఆయన ఇంటెన్స్ లుక్ కట్టిపడేస్తోంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతోన్న పాన్ ఇండియా మూవీ 'దేవర' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. లాంటి అంతర్జాతీయ స్థాయి సినిమా తర్వాత ఎన్టీఆర్ చేస్తున్న చిత్రం కావడంతో 'దేవర'పై అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. దానికి తగ్గట్టుగానే హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివతో పాటు టీమంతా కష్టపడుతోంది. తొలి భాగాన్ని ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు శ్రమిస్తోంది. అయితే, 'దేవర' టీజర్ కోసం ఎన్టీఆర్ అభిమానులు చాలా రోజులుగా అడుగుతున్నారు. టీజర్ ఎప్పుడు వస్తుంది అంటూ నిర్మాణ సంస్థలను సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తున్నారు. టీజర్ డేట్‌ను త్వరలోనే ప్రకటిస్తామని నందమూరి కళ్యాణ్ రామ్ కూడా ఇటీవల ఇంటర్వ్యూల్లో చెప్పారు. మొత్తానికి అప్‌డేట్ వచ్చేసింది. కొత్త సంవత్సరంలోకి దుగుపెట్టినరోజున ఎన్టీఆర్ తన అభిమానులకు మరో పండగ తీసుకొచ్చారు. టీజర్‌ను జనవరి 8న విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ కొత్త పోస్టర్‌ను వదిలారు. ఈ పోస్టర్‌లో ఎన్టీఆర్ లుక్ అదిరిపో యింది. 'అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. దేవర గ్లింప్స్‌ను జవవరి 8న మీ ముందుకు తీసుకురావడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను' అని ఎన్టీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అలాగే, తన కొత్త పోస్టర్‌ను కూడా పొందుపరిచారు. ఈ పోస్టర్‌లో ఎన్టీఆర్ సముద్రంలో పడవపై నిలబడి ఉన్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ ఫస్ట్ లుక్ విడుదలైంది. ఆ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ఎన్టీఆర్ నలుపు రంగు పంచ, చొక్కా ధరించి చేతిలో పెద్ద కత్తితో సముద్రపు ఒడ్డున రాళ్లపై నిలబడి ఉంటారు. ఈ లుక్ చూసి ఫ్యాన్స్ సంబరపడిపోయారు. అయితే, ఈసారి మాత్రం కాస్త స్టైలిష్‌గా, ఇంకాస్త రగ్డ్‌గా ఎన్టీఆర్ ఇంటెన్సివ్ లుక్‌ను తీసుకొచ్చారు. ఈ లుక్ మరింతగా ఫ్యాన్స్‌ను ఆకర్షిస్తోంది. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో నందమూరి తారక రామారావు ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూరుస్తున్నారు. రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాకు సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైనర్. శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్. యుగంధర్ టి విజువల్ ఎఫెక్ట్స్ సూపర్‌వైజర్. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ సినిమాతో జాన్వీ కపూర్ హీరోయిన్. సైఫ్ అలీ ఖాన్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు.


## ఏందయ్యా ధనుష్ ఇట్టా ..



ధనుష్ హీరోగా నటించిన కెప్టెన్ మిల్లర్ జనవరి 12న రిలీజ్ కాబోతున్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఈ సినిమా టీమ్ తెలుగు ఆడియన్స్‌కి పెద్ద షాకిచ్చింది. అదేంటో ఓ లుక్కేద్దాం. 2024 సంక్రాంతికి డైరెక్టర్ సినిమాలతో పాటు పలు డబ్బింగ్ చిత్రాలు కూడా పోటీపడుతున్నాయి. దీంతో బాక్సాఫీస్ ఫైట్ మాములుగా ఉండదని ఆడియన్స్ ఎదురు చూస్తున్నారు. డబ్బింగ్ సినిమాల్లో తమిళ స్టార్ హీరో ధనుష్ నటించిన 'కెప్టెన్ మిల్లర్' చిత్రంపై తెలుగులో భారీ అంచనాలే ఉన్నాయి. అయితే తాజాగా ఈ మూవీ టీమ్ ఓ డెసిషన్ తీసుకున్నట్లు తెలుస్తుంది. తెలుగు నో... కెప్టెన్ మిల్లర్ సినిమా తమిళం, కన్నడ, హిందీలలో జనవరి 12న థియేటర్లలో రిలీజ్ కాబోతున్నట్లు మూవీ టీమ్ ప్రకటించింది. కానీ తెలుగు వెర్షన్ విడుదల తేదీని మాత్రం చెప్పలేదు. మరి నిర్మాతలు వేరే రిలీజ్ డేట్‌ను చూస్తున్నారా లేక తెలుగు వెర్షన్‌ను డైరెక్ట్‌గా తర్వాత విడుదల చేస్తారా అనే దానిపై క్లారిటీ లేదు. అందుకే తగ్గారా ఈ సంక్రాంతికి తెలుగు బాక్సాఫీస్ దగ్గర భారీ లైనప్ ఉంది. సూపర్ స్టార్ మహేశ్ బాబు సినిమా 'గుంటూరు కారం'జనవరి 12న రిలీజ్ కాబోతుంది. అదే రోజు ప్రశాంత్ వర్మ-తేజ సజ్జా సినిమా హను-మాన్ కూడా విడుదల అవుతుంది. ఆ తర్వాత ఒక్క రోజు గ్యాప్‌లో నాగార్జున నటించిన నా సామిరంగా కూడా వస్తుంది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో డబ్బింగ్ సినిమాలకి థియేటర్లు దొరకడం కాస్త కష్టమే. అందులోనూ ధనుష్‌కి తెలుగులో మంచి మార్కెట్ కూడా ఉంది. అలాంటప్పుడు సినిమా బాగుండి థియేటర్లు తక్కువ దొరికితే ఉపయోగం లేదని మూవీ టీమ్ అనుకుంటున్నట్లు టాక్. అందుకే సినిమాను తెలుగులో కాస్త లేట్‌గా రిలీజ్ చేద్దామని అనుకుంటున్నారట.

ధనుష్ లాస్ట్ సినిమా 'సార్' తమిళ్‌తో పాటు తెలుగులో కూడా సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. వెంకీ కుదుముల డైరెక్ట్ చేసిన ఈ చిత్రంలో ధనుష్ యాక్టింగ్‌కి తెలుగు ఆడియన్స్ ఫిదా అయిపోయారు. ఆ తర్వాత వస్తున్న చిత్రం కావడంతో కెప్టెన్ మిల్లర్‌పై మంచి అంచనాలే ఉన్నాయి. కానీ తెలుగులో స్ట్రెయిట్ ఫిలిమ్స్ హడావిడి ఉండటంతో కెప్టెన్ మిల్లర్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్‌గా నటించింది. ఇక కన్నడ స్టార్ హీరో శివ రాజ్‌కుమార్ ప్రత్యేక పాత్రలో కనిపిస్తున్నారు. అలానే సందీప్ కిషన్, నివేదిత సతీష్, జాన్ కొక్కెన్, విజయకన్, ఫేమ్ ఎడ్వర్డ్ సోన్నెన్‌బ్లిక్ కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సత్యజ్యోతి ఫిలింస్ బ్యానర్‌పై సెంథిల్ త్యాగరాజ్, అర్జున్ త్యాగరాజన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చారు.

## తమన్ ఇచ్చిన రెమ్యూనరేషన్ మీద చర్చలు



కుర్చీ మడతపెట్టి అంటూ గుంటూరు కారం నుంచి వదిలిన పాట మీద ఎన్ని రకాల విమర్శలు వచ్చాయో అందరికీ తెలిసిందే. ఇక కుర్చీ తాత చెప్పిన విషయాలు ఇప్పుడు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. పాట రెమ్యూనరేషన్ మీద ఇప్పుడు చర్చలు జరుగుతున్నాయి. సోషల్ మీడియా, రీల్స్ ఇలా అన్నింట్లో ఎప్పుడూ ఏది ఎలా ట్రెండ్ అవుతుందో చెప్పలేం. ఈ మధ్య కాలంలో కుర్చీ తాత డైలాగ్ బాగానే వైరల్ అయింది. కాస్త బీప్ వేసుకునేలా పదాలుంటాయి. ఇప్పుడు అలాంటి అడల్ట్ పదాలతో ఉన్న పాటను మహేష్ బాబు లాంటి స్టార్ హీరో సినిమాకు వాడేశారు. గుంటూరు కారం సినిమాలో కుర్చీ మడత పెట్టి అనే పాటను పెట్టేశారు. ఇక ఈ పాటకు మహేష్ బాబు ఊర మాస్ స్టెప్పులు వేశాడు. మహేష్ బాబు హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన గుంటూరు కారం జనవరి 12 ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధంగా ఉంది. ఈ సినిమా ఎన్నో అంచనాల నడుమ సంక్రాంతి బరిలోకి దిగుతోంది. ఈ క్రమంలోనే సినిమా నుంచి వరుసగా అప్డేట్స్ విడుదల చేస్తూ సినిమాపై అంచనాలను పెంచేస్తోంది చిత్రయూనిట్. దీంట్లో భాగంగానే రీసెంట్‌గా కుర్చీ మడతపెట్టి అనే మాస్ పాటను రిలీజ్ చేశారు. ప్రోమో రిలీజ్ అయిన క్షణం నుంచే ట్రోలింగ్ స్టార్ట్ అయింది. విలువలు అని మాట్లాడే త్రివిక్రమ్.. సరస్వతీ పుత్ర అని పెట్టుకునే రామజోగయ్య శాస్త్రి, మహేష్ బాబు రేంజ్‌లకు ఈ కుర్చీ మడత పెట్టి అనే పదాల్ని వాడాల్సిన అవసరం ఏముంది? అంటూ నెటిజన్లు మండి పడుతున్నారు. కానీ మహేష్ ఫ్యాన్స్ మాత్రం ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ పాటలోని జోష్, మహేష్ బాబు ఎనర్జి, ఆ స్టెప్పులు చూసి థియేటర్లు బద్దలవ్వడం ఖాయమని అంటున్నారు. ఇక కుర్చీ తాత ఈ పాట గురించి నోరు విప్పాడు. ఈ పాటకు సంబంధించినటువంటి ప్రోమో వీడియో విడుదలైన తర్వాత కుర్చీ తాత వరుస ఇంటర్వ్యూలకు హాజరవుతూ సందడి చేస్తున్నారు. ఈ పాట పాడినందుకు తనకు ఇచ్చినటువంటి రెమ్యూనరేషన్ గురించి కూడా మాట్లాడాడు. అయితే ప్రస్తుతం ఈ పాట కోసమే ఈయన తీసుకున్నటువంటి రెమ్యూనరేషన్ హాట్ టాపిక్ గా మారింది. కొందరేమో లక్ష రూపాయల వరకు రెమ్యూనరేషన్ ఇచ్చారని చెబుతున్నారు. తనకు కేవలం 5000 రూపాయలు మాత్రమే ఇచ్చారు అంటూ కుర్చీ తాత చెబుతున్నాడు. ఇలా ఒక్కో విధంగా మాట్లాడటంతో ఈయన ఈ పాటకు తీసుకున్నటువంటి రెమ్యూనరేషన్ గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరి కుర్చీ మడత పెట్టే అనే సాంగ్ కోసం తాత ఎంత తీసుకున్నారనే విషయంపై క్లారిటీ రావాలి అంటే తమన్ స్పందించాల్సి ఉంది. మొత్తానికి ఈ పాట మాత్రం మహేష్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.

## గుట్టు రట్టు చేసాడే!



ఆ టాపిక్ కూడా ఇంతవరకూ వాళ్లిద్దరి దృష్టికి అంత సీరియస్ గానూ వెళ్లినట్లు లేదు. జాన్వీకపూర్ –శిఖర్ పహారియా కొంత కాలంగా సీరియస్‌గా లవ్‌లో ఉన్నట్లు బాలీవుడ్ మీడియాలో ప్రచారం సాగుతోన్న సంగతి తెలిసిందే. అందుకు తగ్గట్టు జంటగా చిక్కిన సందర్భాలెన్నో. కలిసి పబ్ లకు వెళ్లడం దగ్గర నుంచి గుళ్లు గోపురాలు చుట్టేయడం వరకూ ఈ జోడీ మీడియాలో నిత్యం హాట్ టాపిక్ అవుతుంది. కానీ ఇంతవరకూ ఈ వ్యవహారమంతా ఎక్కడా అధికారికం కాలేదు. జాన్వీ గానీ..శిఖర్ గానీ ఎక్కడా స్పందించలేదు. 'యానిమల్'కి అరుదైన రికార్డ్ ఆ టాపిక్ కూడా ఇంతవరకూ వాళ్లిద్దరి దృష్టికి అంత సీరియస్ గానూ వెళ్లినట్లు లేదు. సహజంగా బాలీవుడ్ లో ఇలాంటి ఎఫైర్ ప్రచారం మొదలైతే పీక్స్ లో ఉంటుంది. కానీ జాన్వీ-శిఖర్ వ్యవహారంలో మాత్రం కాస్త స్లోగానే కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా కరణ్ జోహార్ ఆ గట్టుని రట్టు చేసే ప్రయత్నం చేసాడు. కరణ్ జోహార్ టాక్ షో 'కాఫీ విత్ కరణ్'లో జాన్వీకపూర్ తన సోదరి కుషీ కపూర్ తో కలిసి హాజరైంది. తాజాగా ఆ ఎపిసోడ్ ప్రోమో వైరల్ అవుతుంది. అల్ట్రా గ్లామర్ స్టన్నింగ్ జాన్వీ ఫోన్ లో శిఖర్ పహారియా నెంబర్ తన స్పీడ్ డయల్ లిస్ట్ లో ఉన్నట్లు అమ్మడు ధృవీకరించింది. కరణ్ జోహార్ తన స్పీడ్ డయల్ లిస్ట్‌లో ఉన్న ముగ్గురు పేర్లు సూచించగా.. జాన్వీ కుషీ మరియు షికు అని సమాధానం ఇచ్చింది. దీంతో చెల్లెలు ఖుషీ కపూర్ తర్వాత అత్యంత ఇష్టంగా ఇష్టపడేది శిఖర్ నే నా? అంటూ నెట్టింట ప్రచారం ఊపందుకుంది. ఇక ఇదే వేదికపై కరణ్ ఖుషీ కపూర్ ని కూడా వదిలిపెట్టలేదు. అమ్మడు ఇండస్ట్రీకి రాకముందే? నీ కథ ఏంటో తేలాలంటూ కూర్చున్నాడు. ఖుషీ కపూర్‌ని వేదాంగ్ రైనాతో డేటింగ్ గురించి ప్రశ్నించగా? ఖుషీ అతడు కేవలం తనకు స్నేహితుడు మాత్రమేనని బధులిచ్చింది. దీంతో వాళ్లిద్దరి రిలేషన్ షిప్ గురించి ఓ క్లారిటీ వచ్చింది. ది అర్చీస్ తో ఖుషీ కపూర్ లాంచ్ అయిన సంగతి తెలిసిందే. ఇదే ఏడాది కరణ్ జోహర్ బ్యానర్ లోనే ఖుషీ కూడా హీరోయిన్ గా ఎంట్రీ ఇస్తుంది.

Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.